# భారతశక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 16 సంచిక:154 | విజయవాడ, 27-02-2026, శుక్రవారం | పేజీలు: 8 | వెల: 1.00


## స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్‌లోకి దూసుకెళ్లిన కారు

జనగామ: జిల్లాలోని చిల్పూరు మండలం దేశాయి తండా సమీఫంలోని స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్‌లోకి ఓ షిఫ్ట్‌కారు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ధారావత్ చరణ్(18) అనే యువకుడు తీవ్ర గాయాలతో బయటపడగా, డ్రైవింగ్ చేస్తున్న భూక్య పవన్ అనే వ్యక్తి ఆచూకీ లభించలేదు. అయితే గాలింపు చర్యల్లో అతని మృతదేహం లభించింది. స్టేషన్‌ఘన్‌పూర్ నుండి దేశాయి తండా వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. s

## వాయుసేన విన్యాసాలు.. 'ప్రచండ్'లో ప్రయాణించనున్న రాష్ట్రపతి

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రాజస్థాన్‌లో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం జైసల్మేర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌ను సందర్శించనున్నారు. ఈ సందర్భంగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ 'ప్రచండ్'లో గగన విహారం చేయనున్నారు. అనంతరం భారత్- పాకిస్థాన్ సరిహద్దు సమీపంలోని పోఖ్రాన్‌లో వైమానిక దళం ఆధ్వర్యంలో 'వాయు శక్తి' పేరిట నిర్వహించనున్న విన్యాసాలను వీక్షించనున్నారు.


ఎల్‌సీహెచ్ 'ప్రచండ్' అనేది స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి యుద్ధ హెలికాప్టర్. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ) దీన్ని తయారుచేసింది. 2022 అక్టోబరులో వాయుసేనలోకి ప్రవేశపెట్టారు. ఎడారుల నుంచి పర్వతాల వరకు విభిన్న ప్రాంతాల్లో దీన్ని నడపొచ్చు. 5,000 మీటర్ల పైన ఎత్తులోనూ ఎగరగలదు. ముఖ్యంగా పర్వత ప్రాంత సరిహద్దుల వెంట మోహరింపునకు ఇది అనుకూలంగా ఉంటుంది. అధునాతన ఏవియానిక్స్, స్టెల్త్ ఫీచర్లు, రాత్రి వేళల్లోనూ దాడులు చేయగల సామర్థ్యం దీని సొంతం. క్షిపణులు, రాకెట్లు, 20 ఎంఎం గన్ వంటి ఆయుధాలను ప్రయోగించవచ్చు.

రాష్ట్రపతి ముర్ము 2023 ఏప్రిల్‌లో అస్సాంలోని తేజ్‌పూర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధ విమానంలో ప్రయాణించారు. గతేడాది అక్టోబరులో అంబాలాలో రఫేల్ యుద్ధ విమానంలో గగన విహారం చేశారు. వాయుసేనకు చెందిన రెండు వేర్వేరు యుద్ధ విమానాల్లో ప్రయాణించిన తొలి రాష్ట్రపతిగా ముర్ము నిలిచారు. గతేడాది డిసెంబరులో కర్ణాటకలోని కార్వార్ తీరంలో కల్వరి శ్రేణి జలాంతర్గామి 'ఐఎన్ఎస్ వాఘ్‌షీర్'లో ప్రయాణించారు.



## ఇన్‌స్టాలో మోదీ క్రేజ్.. 10 కోట్లు దాటిన ఫాలోవర్లు

ప్రధాని నరేంద్ర మోదీ (గ్రావీ చీఖతీవఅనతీఖ వీశీనఱ) క్రేజ్ రోజురోజుకి పెరిగిపోతోంది. బయటే కాకుండా సామాజిక మాధ్యమాల్లో కూడా ఆయన హవా కొనసాగుతోంది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్ (×అర్ఘుస్త్రతీఖఎ)లో ఆయన ఫాలోవర్ల సంఖ్య 10 కోట్లు దాటింది. ప్రపంచంలో ఇంతమంది ఫాలోవర్లు ఉన్న రాజకీయ నేతగా ఆయన



రికార్డు సృష్టించారు.

2014 నుంచి మోదీ ఇన్‌స్టాగ్రామ్ వినియోగించడం ప్రారంభించారు. మరో సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఇప్పటికే ఆయనను అనుసరించే వారి సంఖ్య 10 కోట్లు దాటేసింది. కాగా.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కంటే.. మోదీ ఫాలోవర్ల సంఖ్య రెండు రెట్లు ఎక్కువ. 4.3 కోట్ల మంది ఫాలోవర్లతో ట్రంప్ రెండో స్థానంలో ఉన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో (1.5 కోట్లు), బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా (1.4 కోట్ల మందికి పైగా), తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ (1.1కోట్లు), అర్జెంటీనా అధ్యక్షుడు హవియేర్ మిలే (64 లక్షలు) ఉన్నారు. ఇక, కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీకి ఇన్‌స్టాగ్రామ్‌లో 1.2 కోట్లు మందికి పైగా ఫాలోవర్లు ఉన్నారు.

## ప్రభుత్వానికి అలాంటి ఉద్దేశం లేదు: NCERT పాఠ్యాంశం వివాదం వేళ కేంద్రం స్పందన

జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి ఎనిమిదో తరగతి సాంఘిక శాస్త్రం కొత్త పాఠ్య పుస్తకంలో 'న్యాయ వ్యవస్థలో అవినీతి' అంటూ ఒక అధ్యాయాన్ని ప్రచురించడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు ఆ పుస్తకాన్ని నిషేధించింది. ఈ నేపథ్యంలో కేంద్రం నుంచి స్పందన వచ్చింది. ఈ వ్యవహారంపై కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విచారం వ్యక్తం చేశారు.

"ఈ విషయం నా దృష్టికి రాగానే ఆ పుస్తకాలు సర్క్యులేషన్‌లో లేకుండా వెనక్కి తీసుకోవాలని చీజజు=ని ఆదేశించాను. న్యాయ వ్యవస్థను అగౌరవపర్చాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదు. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం. మేం న్యాయవ్యవస్థకు అత్యున్నత గౌరవం ఇస్తాం. కోర్టు నిర్ణయానికి కట్టుబడి ఉంటాం. జరిగినదాని



పట్ల చింతిస్తున్నాను. చీజజు=పై విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. భవిష్యత్‌లో ఇలాంటి తప్పిదాలు పునరావృతం కాకుండా చూసుకుంటాం" అని మంత్రి ( వెల్లడించారు.

ఈ పుస్తకంలోని అధ్యాయాన్ని తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు ఇప్పటికే సుమోటోగా విచారణకు చేపట్టిన సంగతి తెలిసిందే. ఇదంతా న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు చేసిన కుట్రేనంటూ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ విచారణ సందర్భంగా ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బేషరతుగా క్షమాపణలు చెప్పారు. ఇక ఇప్పటికే ఎన్‌సీఈఆర్‌టీ ఆ పాఠ్యపుస్తకాన్ని అధికారిక వెబ్‌సైట్ నుంచి తొలగించింది. అసంబద్ధమైన అంశాలను ప్రచురించినందుకు క్షమాపణ చెప్పింది.

## న్యాయవ్యవస్థ రక్తం చిందిస్తోంది: NCERT వివాదాస్పద బుక్‌ను నిషేధించిన సుప్రీం



జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) ఎనిమిదో తరగతి సాంఘిక శాస్త్రం కొత్త పాఠ్యపుస్తకంలో న్యాయవ్యవస్థలో అవినీతిపై ఒక అధ్యాయాన్ని ప్రచురించడం వివాదం అవుతోంది. ఈ అంశాన్ని సుమోటోగా పరిగణించిన సుప్రీంకోర్టు.. గురువారం విచారణను ప్రారంభించింది. ఇది న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు చేసిన కుట్రేనంటూ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ వ్యవహారంలో బాధ్యులకు శిక్ష పడాలని సీజేఐ తీవ్రంగా స్పందించారు చీజజు= ). ఈ విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానానికి కేంద్రం బేషరతుగా క్షమాపణలు చెప్పింది. ఈ వ్యవహారాన్ని తాము సమర్థించుకోవడం లేదని ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు వెల్లడించారు.

ఈ విచారణలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "వాళ్లు ప్రయోగించిన బుల్లెట్‌తో న్యాయవ్యవస్థ రక్తం చిందిస్తోంది. న్యాయవ్యవస్థ అధికారాన్ని అణచివేసేలా, గౌరవాన్ని కించపర్చేలా ఉద్దేశపూర్వకంగా చేసిన చర్యగా కనిపిస్తోంది. దీనిని పట్టించుకోకుండా ఇలాగే వదిలేస్తే.. ప్రజలు, యువత మనసుల్లో న్యాయవ్యవస్థ పవిత్రత దెబ్బతినే అవకాశం ఉంది" అని ఆందోళన వ్యక్తంచేశారు. "అలాగే న్యాయవ్యవస్థ పాత్ర వివరించేందుకు ఒక పూర్తి అధ్యాయాన్ని ఎన్‌సీఈఆర్‌టీ కేటాయించింది. కానీ కోర్టుల విశిష్ట చరిత్రను మాత్రం వదిలేసింది. జవాబుదారీతనం ఏర్పడేవరకు ఈ వ్యవహారాన్ని మేం వదిలివేయబోం. దీనికి వెనక ఎవరు ఉన్నారో మేం తెలుసుకోవాలనుకుంటున్నాం" అని వ్యాఖ్యానించారు.

అలాగే ఎన్‌సీఈఆర్‌టీ వివాదాస్పద పుస్తకంపై నిషేధం విధించింది ( ). ఆ నిషేధాన్ని ఉల్లంఘిస్తే.. కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించింది. ఆ సంస్థ డైరెక్టర్, స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రటరీకి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరించాలని ఆదేశించింది. ఈ సందర్భంగా తుషార్ మెహతా స్పందిస్తూ.. న్యాయవ్యవస్థకు తామెప్పుడూ అండగా ఉంటామన్నారు. పబ్లిక్ నోటీసు ద్వారా బేషరతుగా క్షమాపణలు చెప్తామని కోర్టుకు తెలియజేశారు. తదుపరి విచారణ మార్చి 11న జరగనుంది.

ఇదీ జరిగింది..

పుస్తకంలో న్యాయవ్యవస్థపై అభ్యంతరకర వ్యాఖ్యలు ఉన్నాయని సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీలు సీజేఐ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. బుధవారం దానిపై స్పందించిన సీజేఐ.."న్యాయవ్యవస్థకు కళంకం ఆపాదించేలా ఎవరు ప్రవర్తించినా అనుమతించను" అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఈ నేపథ్యంలో న్యాయవ్యవస్థలో అవినీతి గురించిన పాఠ్యాంశంతో కూడుకున్న పుస్తక పంపిణీని నిలిపివేయాల్సిందిగా ఎన్‌సీఈఆర్‌టీ (చీజజు=)ని కేంద్ర విద్యాశాఖ ఇప్పటికే ఆదేశించింది. అసంబద్ధమైన విషయాలు పాఠ్యాంశంలో వచ్చాయని, నిర్ణయం తీసుకోవడంలో పొరపాటు వల్ల ఇలా జరిగిందని ఎన్‌సీఈఆర్‌టీ తెలిపింది. పాఠ్యపుస్తకాన్ని అధికారిక వెబ్‌సైట్ నుంచి తొలగించింది. అసంబద్ధమైన అంశాలను ప్రచురించినందుకు క్షమాపణ చెప్పింది.

## చివరి రోజు వరకు ఇదే స్ఫూర్తితో పని చేయండి: సీఎం రేవంత్‌రెడ్డి




హైదరాబాద్: తెలంగాణ ప్రజలు ఆకలినైనా సహిస్తారు కానీ, ఆధిపత్యాన్ని సహించబోరని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి గ్రూప్ 1 పరీక్షలను నిర్వహించి.. నియామక పత్రాలు అందించామన్నారు. గ్రూప్ 1, 2 ఉద్యోగుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాలను అమ్ముకున్నామని కోర్టుల్లో లీగల్ లిటిగేషన్ పెట్టారని, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క తప్పు కూడా చేయలేదని అన్నారు.

"బాగా చదువుకున్న వాళ్లను టీజీపీఎస్సీలో నియమించాం. అన్ని జాగ్రత్తలతో పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించాం. మీరంతా శిక్షణ పూర్తి చేసుకొని ఉద్యోగాల్లో చేరుతున్నారు. ప్రభుత్వం మిమ్మల్నే రాష్ట్ర ప్రతినిధులుగా భావిస్తోంది. మీ ద్వారానే ప్రభుత్వ పథకాలు అమలవుతాయి. మేం ఎన్ని పాలసీలు చేసినా.. దాని అమల్లో మీరే చాలా ముఖ్యం. బాధ్యతాయుతమైన పదవుల్లో చేరుతున్నారు. ఉద్యోగవిరమణ రోజు వరకు ఇదే స్ఫూర్తితో పని చేయాలి" అని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులతోపాటు శిక్షణ పూర్తి చేసుకున్న 271 మంది గ్రూప్-1, 171 మంది గ్రూప్-2 అధికారులు, 51 మంది మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రైవేటు స్కూళ్లలో ఫీజులపై ప్రభుత్వానికి విద్యా కమిషన్ నివేదిక

హైదరాబాద్: ప్రీ ప్రైమరీ నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర పాలసీ తయారీ కోసం ఏర్పాటైన తెలంగాణ విద్యా కమిషన్ సీఎం రేవంత్‌రెడ్డికి సమగ్ర నివేదిక అందించింది. రాష్ట్ర వ్యాప్తంగా 305 పాఠశాలలను సందర్శించి నివేదిక రూపొందించినట్లు కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లతో 46 సమావేశాలు నిర్వహించినట్లు చెప్పారు.

## తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ.. జీఏడీ ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జా

హైదరాబాద్: తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. మొత్తం 45 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులయ్యారు. బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శిగానూ ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్‌కుమార్, విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌ను నియమించారు. ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ విభాగం కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్, దేవాదాయశాఖ కమిషనర్‌గా ఎం.హనుమంతరావు, ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా డి.దివ్యను ప్రభుత్వం నియమించింది. వీరితో పాటు పలు జిల్లా కలెక్టర్లనూ ప్రభుత్వం బదిలీ చేసింది. యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా అనురాగ్ జయంతిని నియమించింది.

భారత శక్తి

# ఓటింగ్ కు ఏఐ మిక్సింగ్

భారత ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేయడంపై కేంద్ర ఎన్నికల సంఘం దృష్టి సారించింది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనది. అయితే వలసలు, అనారోగ్యం లేదా ఇతర అనివార్య కారణాల వల్ల లక్షలాది మంది తమ ఓటు హక్కును వినియోగించుకోలేకపోతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా బిహార్ రాష్ట్ర ఎన్నికల సంఘం 'కృత్రిమ మేధ' 'బ్లాక్‌చెయిన్' సాంకేతికతలతో కూడిన ఇ-ఓటింగ్ విధానాన్ని తెరపైకి తెచ్చింది. 2026లో జరిగిన 'ఏఐ ఇంపాక్ట్ సమిట్'లో ఈ విధానాన్ని ప్రదర్శించి దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది.ఇందుకోసం ఢిల్లీ భారత మండపంలో కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ల జాతీయ రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. ఇది 27 ఏళ్ల తర్వాత కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులు మధ్య జరుగుతున్న రౌండ్ టేబుల్ సమావేశం. ఈవీఎంలు, ఓటర్ల జాబితాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ఎన్నికల ప్రక్రియలను బలోపేతం చేయడంపై అంశాలపై అధికారులు చర్చలు జరపనున్నారు. చివరిసారిగా ఇలాంటి సమావేశం 1999లో జరిగింది.ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అధ్యక్షత వహిస్తారు. ఎన్నికల కమిషనర్లు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు డాక్టర్ వివేక్ జోషి సమక్షంలో ఈ సమావేశం జరుగుతుంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల రాష్ట్ర ఎన్నికల కమిషనర్లు, చట్టపరమైన, సాంకేతిక నిపుణులు పాల్గొంటారు. మొత్తం 36 రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల నుంచి రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రధాన ఎన్నికల అధికారులు పాల్గొనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ల పనితీరు, ఎన్నికల ప్రక్రియలు, లాజిస్టిక్స్ ను పెంపొందించడం, నిర్మాణాత్మక ఆలోచనల మార్పిడికి ఎన్నికల నిర్వహణలో సహకార సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేయడం అంశాలపై చర్చలు జరగనున్నాయి.ఎన్నికల ప్రక్రియలను బలోపేతం చేయడంతో పాటు, సాంకేతికత, ఈవీఎంలు, ఓటర్ల జాబితా అంశాలపై చర్చలు జరగనున్నాయి. ఇటీవల ప్రారంభించినడిజిటల్ ప్లాట్‌ఫామ్, ఎన్నికల సేవలను క్రమబద్ధీకరించడంలో మార్పులు, సాంకేతికత వినియోగ కార్యాచరణ కార్యక్రమాలపై ఎన్నికల కమిషన్ సీనియర్ అధికారులు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పటిష్టత, పారదర్శకత, భద్రత అంశాలపై రాష్ట్రాల ఎన్నికల అధికారులకు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు సీనియర్ ఎన్నికల అధికారులు..అన్ని ప్రాంతాలలో ఓటర్ల జాబితా తయారీని నియంత్రించే చట్టపరమైన మార్గదర్శకాలను సులభతరం చేయడానికి, ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950కి సంబంధించి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వారీగా ఓటర్ల అర్హతపై చర్చలు జరగనున్నాయి. ఆర్టికల్స్ 243ఐ, 243జిం ప్రకారం పంచాయతీలు, మున్సిపల్ సంస్థలకు ఎన్నికల జాబితా తయారీ, నిర్వహణ పర్యవేక్షణ, దిశానిర్దేశం నియంత్రణను రాష్ట్ర ఎన్నికల కమిషన్లు కలిగి ఉన్నాయి. దేశవ్యాప్తంగా సర్ ప్రక్రియ సహా త్వరలో జమిలి ఎన్నికల పై చర్చ జరుగుతున్న నేపథ్యం కేంద్ర రాష్ట్ర ఎన్నికల అధికారుల సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.ద్యోగాల కోసం ఇతర నగరాలకు వెళ్లే కార్మికులు, దూర ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులు, అలాగే శారీరక ఇబ్బందులు ఎదుర్కొనే వృద్ధులు, వికలాంగులకు ఈ విధానం ఒక వరంలా మారనుంది. పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే, తమ వద్ద ఉన్న స్మార్ట్‌ఫోన్ ద్వారానే సురక్షితంగా ఓటు వేసే వెసులుబాటును ఈ ఇ-ఓటింగ్ యాప్ కల్పిస్తుంది. పట్టణ ప్రాంతాల్లో తగ్గుతున్న ఓటింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా బిహార్ ప్రభుత్వం ఇప్పటికే మున్సిపల్ ఉప ఎన్నికల్లో దీనిని విజయవంతంగా పరీక్షించింది. ఈ ఓటింగ్ సాంకేతికతతో పకడ్బందీ భద్రత డిజిటల్ ఓటింగ్ అనగానే భద్రతపై అనేక అంచనాలు ఉంటాయి. అందుకే బిహార్ ఎన్నికల సంఘం అత్యున్నత స్థాయి రక్షణ చర్యలను చేపట్టింది: ఫేషియల్ రికగ్నిషన్: ఓటరు గుర్తింపు కార్డు డేటాబేస్ ఆధారంగా ముఖ గుర్తింపు ప్రక్రియ ద్వారా అసలైన ఓటరును గుర్తిస్తారు. బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ: వేసిన ప్రతి ఓటు ఎన్‌క్రిప్ట్ చేయబడి బ్లాక్‌చెయిన్‌లో రికార్డ్ అవుతుంది. దీనివల్ల డేటాను ఎవరూ ట్యాంపర్ చేయడం లేదా మార్చడం అసాధ్యం. డిజిటల్ ఈవీఎం: స్మార్ట్ కాంట్రాక్ట్ వ్యవస్థ ద్వారా డిజిటల్ పద్ధతిలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. రిటర్నింగ్ అధికారి డిజిటల్ సిగ్నేచర్ ఉంటేనే డేటా డీక్రిప్ట్ అవుతుంది. ఓటు వేయడం ఇప్పుడు సులభం ఓటర్లు ముందుగా అధికారిక యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఓటీపీ ద్వారా మొబైల్‌ను ధ్రువీకరించుకోవాలి. ఆపై ఎపిక్ కార్డు వివరాలు నమోదు చేసి, లైవ్ ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా తమను తాము ధ్రువీకరించుకున్న తర్వాత నేరుగా ఓటు వేయవచ్చు. ఈ ప్రక్రియ అంతా అత్యంత రహస్యంగా, పారదర్శకంగా సాగేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఏదైనా కొత్త వ్యవస్థ అమల్లోకి వచ్చినప్పుడు కొన్ని ఇబ్బందులు సహజం. పాత ఫోటోలు స్పష్టంగా లేకపోవడం, ఇంటర్నెట్ అంతరాయాలు, డిజిటల్ అక్షరాస్యత లేకపోవడం వంటి సవాళ్లు ఉన్నప్పటికీ.. బిహార్ ఎన్నికల సంఘం నమూనా ఓటింగ్ ద్వారా ప్రజల్లో, రాజకీయ పార్టీల్లో నమ్మకాన్ని కలిగించగలిగింది. ఫలితాల లెక్కింపు కోసం కూడా ఏఐ ఆధారిత ఓసీఆర్ వ్యవస్థను వాడుతుండటం వల్ల మానవ తప్పిదాలకు తావు లేకుండా వేగంగా ఫలితాలు వెలువడనున్నాయి.. మరో వైపు ఏపీ, తెలంగాణ సహా 22 రాష్ట్రాల్లో ఓటర్ జాబితాలను సవరించబోతోంది. దీన్నే సర్ అని పిలుస్తున్నారు. అంటే.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అని అర్థం. ఈ సర్ ద్వారా.. కేంద్ర ఎన్నికల సంఘం.. ఓటర్ల జాబితాల్ని పూర్తిగా పరిశీలించి, తప్పులను సరిచేస్తుంది. అంటే ప్రక్షాళన చేస్తుందన్నమాట. ఇది ఏప్రిల్ నుంచి మొదలయ్యే ఛాన్స్ ఉంది.

# గ్రేటర్ విశాఖపై గురి

విశాఖపట్టణం, ఫిబ్రవరి 26,

సాధారణంగా ఉత్తరాంధ్ర అంటే తెలుగుదేశం పార్టీ అధిపత్యముంటుంది. ఒకటి రెండు సార్లు తప్పించి ఆ పార్టీదే హవా. విశాఖ నగరం గురించి చెప్పనవసరం లేదు. తెలుగుదేశం పార్టీకి ఆ నగరం కంచుకోట. కానీ ఒక విషయంలో మాత్రం తీరని లోటు. గ్రేటర్ విశాఖపట్నం మాత్రం ఆ పార్టీకి చిక్కలేదు. అప్పుడెప్పుడో ఐదేళ్లపాటు మాత్రం ఆ పార్టీ గ్రేటర్ విశాఖ ను ఏలింది. కానీ తరువాత మాత్రం చిక్కలేదు. ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మేయర్ పదవిని స్వాధీనం చేసుకుంది. వచ్చే ఎన్నికల్లో మరోసారి గెలిచి గ్రేటర్ పీఠాన్ని దక్కించుకోవాలని చూస్తోంది. అయితే టిడిపి తో పాటు మిత్రపక్షాలైన జనసేన, బిజెపి సైతం విశాఖపట్నం పీఠాన్ని ఆశిస్తున్నాయి. ఆ దిశగా పావులు కదుపుతున్నాయి.రాష్ట్రంలోనే అతిపెద్ద కార్పొరేషన్ విశాఖపట్నం. 98 డివిజన్లతో గ్రేటర్ విశాఖ ఉంది. అయితే శివారు ప్రాంతాలను కలుపుతూ 150 డివిజన్లుగా మార్చాలన్న ఆలోచన ఉంది. ముఖ్యంగా భీమిలి, అనకాపల్లిలోని గ్రామీణ మండలాలను కూడా కలుపుతారని ఎప్పటినుంచో టాక్ ఉంది. ఇవన్నీ జీవీఎంసీలో కలిస్తే మరో 25 డివిజన్లు పెరుగుతాయి. జీవీఎంసీని 150 వార్డులుగా పెంచాలన్నది కూటమి ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది. అయితే ఈ డివిజన్ల చేర్పుల ప్రక్రియ అంత ఈజీగా తేలేలా లేదు. మరో ఆరు నెలల సమయం పట్టే అవకాశం ఉంది.ఇటీవల అవిశ్వాసం పెట్టి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మేయర్ పదవిని అందుకుంది టిడిపి. మరోసారి ఆ పదవిని చేజిక్కించుకోవడం ద్వారా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి షాక్ ఇవ్వాలని భావిస్తోంది. మరోవైపు జీవీఎంసీ మేయర్ పీఠం కోసం కూటమిలో అప్పుడే చర్చ ప్రారంభం అయింది. విశాఖ తొలి మేయర్ పీఠం బిజెపి దక్కించుకుంది. 1987లో టిడిపి గెలిచింది. 1995, 2005,2007 లో వరుసగా మూడుసార్లు కాంగ్రెస్ పార్టీ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. 2021 లో జరిగిన ఎన్నికల్లో మాత్రం వైసిపి మేయర్ పిఠాన్ని దక్కించుకుంది. నాలుగేళ్లపాటు మేయర్ గా వైసీపీకి చెందిన హరి వెంకట కుమారి కొనసాగారు. గత ఏడాది ఆమెపై అవిశ్వాస తీర్మానం పెట్టి పదవి నుంచి దించేశారు. తెలుగుదేశం పార్టీకి చెందిన శ్రీనివాస్ రావు మేయర్ అయ్యారు. ఏడాది మార్పుతో జీవీఎంసీ పాలకవర్గం పదవీకాలం పూర్తి కానుంది.



విశాఖ నగరంలో యాదవ సామాజిక వర్గం అధికం. ఆ సామాజిక వర్గం వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సామాజిక కోణంలోనే యాదవ వర్గానికి చెందిన హరి కుమారిని నియమించింది. అయితే ఇప్పుడు ఆమెను తొలగించి శ్రీనివాసరావు అయ్యారు మేయర్ గా. ఈసారి మాత్రం యాదవ సామాజిక వర్గానికి చెందిన వారికి మేయర్ పదవి కట్ట పెట్టాలన్న డిమాండ్ టిడిపి నుంచి వినిపిస్తోంది. ఇంకోవైపు కాపులు, మత్స్యకారులు, నాగవంశీయులు కూడా మేయర్ పీఠానికి పోటీ పడుతున్నారు.. జనసేన సైతం ఇక్కడ మేయర్ పీఠాన్ని ఆశిస్తోంది. బిజెపికి సైతం విశాఖ నగరంలో బలం ఉంది. దీంతో మేయర్ పదవిని రెండున్నర ఏళ్ల పాటు పంచాలని.. డిప్యూటీ మేయర్ పదవులను మూడు పార్టీలు సమానంగా పంచుకోవాలని ప్రతిపాదనలు వస్తున్నాయి. చూడాలి గ్రేటర్ విషయంలో కూటమి ఎలా ముందుకు వెళ్తుందో..

# జగన్ టెంపుల్ రన్

కడప, ఫిబ్రవరి 26,

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రస్తుతం తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన నందిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన నందీశ్వర ఆలయం విగ్రహ



ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులు, ముఖ్యంగా తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ వివాదం నేపథ్యంలో జగన్ ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది.జగన్ ఈ కార్యక్రమంలో పూర్తిగా హిందూ సంప్రదాయ పద్ధతిలో పాల్గొన్నారు. పంచె కట్టుకుని, సాంప్రదాయ దుస్తుల్లో ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక హోమంలో జగన్ పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా వేద పండితులు నిర్వహించిన క్రతువుల్లో ఆయన చురుగ్గా పాలుపంచుకున్నారు. స్వామివారికి జరిగిన అభిషేకాలు, పూజా కార్యక్రమాల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం పలికారు.ఈ పర్యటన కేవలం ఒక ఆధ్యాత్మిక కార్యక్రమం మాత్రమే కాకుండా, బలమైన రాజకీయ సంకేతాన్ని ఇచ్చే ప్రయత్నంగా విశ్లేషకులు భావిస్తున్నారు. గత కొంతకాలంగా తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో జరుగుతున్న ప్రచారం వల్ల వైసీపీకి హిందూ వ్యతిరేక ముద్ర పడే ప్రమాదం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో జగన్ ఆలయ కార్యక్రమాల్లో, హోమాల్లో పాల్గొనడం ద్వారా తాను హిందూ సంప్రదాయాలను గౌరవిస్తాననే సందేశాన్ని ప్రజల్లోకి పంపే ప్రయత్నం చేస్తున్నారు.అధికారంలో లేని సమయంలో సొంత నియోజకవర్గంలో పర్యటించడం, ఇలాంటి బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా క్షేత్రస్థాయి నాయకులకు, కార్యకర్తలకు జగన్ ధైర్యాన్ని ఇస్తున్నారు. ప్రజల్లో మమేకమవ్వడం ద్వారా పార్టీ బలాన్ని నిరూపించుకోవాలని ఆయన భావిస్తున్నారు. ఆలయ కార్యక్రమం ముగిసిన తర్వాత జగన్ భాకరాపురంలోని తన క్యాంపు కార్యాలయానికి చేరుకుని 'ప్రజా దర్బార్' నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల సమస్యలను అడిగి తెలుసుకోవడం ద్వారా, ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు.ఒకవైపు జగన్ ఆలయాల్లో పూజలు చేస్తుంటే, మరోవైపు అధికార పక్షం ఆయనపై విమర్శలు ఎక్కుపెడుతూనే ఉంది. ముఖ్యంగా తిరుమల అంశంపై అసెంబ్లీలో జరిగిన చర్చల నేపథ్యంలో, కేవలం విమర్శల నుండి తప్పించుకోవడానికే జగన్ ఇలాంటి భక్తి ముసుగు వేసుకుంటున్నారని ప్రత్యర్థులు విమర్శిస్తున్నారు. అయితే, వైసీపీ శ్రేణులు మాత్రం జగన్ ఎప్పుడూ అన్ని మతాలను సమానంగా గౌరవిస్తారని, ఇది కేవలం నమ్మకానికి సంబంధించిన విషయమని వాదిస్తున్నారు.మొత్తానికి, వైఎస్ జగన్ పులివెందుల పర్యటన ఆయన రాజకీయ ప్రయాణంలో ఒక ముఖ్యమైన ఘట్టంగా కనిపిస్తోంది. సంక్షోభ సమయాల్లో దైవ దర్శనం, ప్రజల చెంతకు చేరడం అనే పాత వ్యూహాన్ని ఆయన మళ్ళీ అమలు చేస్తున్నారు. ఈ పర్యటన వల్ల వైసీపీపై ఉన్న ప్రతికూలత తగ్గుతుందా లేదా అనేది భవిష్యత్తులో తేలనుంది.

# మంత్రి పొన్నం తో ప్రొఫెసర్ కోదండరాంచ తెలంగాణ ఉద్యమకారుల భేటి

హైదరాబాద్

మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో తెలంగాణ ఉద్యమకారుల సమావేశం కానుంది. ప్రజా పాలన ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారుల హామీలు నెరవేర్చడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేసారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి త్వరలో ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేయనుందన్నారు. కమిటీకి సంబంధించిన విధి విధానాలు ఉద్యమకారుల హామీలు తదితర అంశాలపై మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ కోదండరాం ఉద్యమకారులు చర్చించారు.

# పోక్సో కేసులో ఇద్దరికి శిక్ష, జరిమానా

రాజన్న సిరిసిల్ల మైనర్ బాలిక పై బలవంతపు వేధింపుల (పోక్సో) కేసులో ఇద్దరు నిందితులకు నాలుగు సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి 2000/-రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు జడ్జి రాధిక జైస్వాల్ గురువారం రోజున తీర్పు వెల్లడించారు.ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన ఒక మైనర్ బాలికను 2021 సంవత్సరంలో వరుసకి అన్న అయిన మైనర్ బాలుడు బలవంతపు వేధింపులకు గురి చేసాడు. బాలుడి తండ్రి జానీ, నానమ్మ పొచవ్వ లు ఎవరికైనా చెప్తే చంపేస్తాం అని బాధితులని బెదిరించారు. విషయం పై బాధితురాలి యొక్క తల్లి పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేసింది. అప్పటి ఎస్.ఐ వెంకటకృష్ణ కేసు నమోదు చేయగా దర్యాప్తు తరువాత అప్పటి సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేసినాడుకేసు పూర్వాపరాలను పరిశీలించిన సిరిసిల్ల పోక్సో కోర్టు జడ్జి రాధిక జైస్వాల్ ఇద్దరు నిందితులు తూర్పటి జానీ,తూర్పటి పొచవ్వకి నాలుగు సంవత్సరల జైలు శిక్ష తో పాటు ఒక్కక్కరికి 2000/- రూపాయల జరిమానా విధించారు. ప్రధాన నిందితుడు మైనర్ కావడం వలన అతని మీద కేసు ప్రస్తుతం జువెనైల్ కోర్టులో నడుస్తుంది..

# హెరిటేజ్ నుంచి భారతికి పాకింది

ఒంగోలు ఫిబ్రవరి 26

ఏపీలోఇప్పుడు నెయ్యి కల్తీ వ్యవహారం రాజకీయ ప్రకంపనలు రేపుతోంది. అయితే పూర్తిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో ఆత్మరక్షణలో పడింది. ఎదురుదాడికి దిగిన క్రమంలో అంబటి రాంబాబు ఎపిసోడ్ నడిచింది. నడిరోడ్డుపై సాక్షాత్ ముఖ్యమంత్రిని తిట్టడం అనేది సభ్య సమాజం హర్షించదు. అయితే రాజకీయాల్లో ఎదురుదాడి అనేది ముఖ్యం. వైయస్సార్ కాంగ్రెస్



పార్టీ తన ఆత్మ రక్షణకు గాను ఇప్పుడు హెరిటేజ్ ను తెరపైకి తెచ్చింది. సాధారణంగా డైరీలు తమ ఉత్పత్తులను పెంచుకునేందుకుగాను.. ఇతర సంస్థలపై ఆధారపడతాయి. అలా ప్రముఖ డైరీ లన్ని ఇందాపూర్ డైరీ నుంచి కొన్ని ఉత్పత్తులు పొందుతాయి. ఈ క్రమంలో హెరిటేజ్ కూడా ఆ జాబితాలో ఉంది. అయితే ఇందాపూర్ డైరీ అనేది హెరిటేజ్ సంస్థది అంటూ ప్రచారం మొదలుపెట్టింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. శాసనమండలిలో దీనిపై చర్చకు పట్టు పట్టింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఈ డిమాండ్ వచ్చిన మరుక్షణం శాసనసభలో చర్చకు అనుమతి ఇచ్చింది ప్రభుత్వం. అయితే హెరిటేజ్ పై క్లారిటీ ఇస్తూనే.. వైసిపి హయాంలో భారతి సిమెంట్స్ వ్యవహారాన్ని బయటపెట్టేశారు సీఎం చంద్రబాబు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒకటి అనుకుంటే.. ఇప్పుడు మరొకటి బయటపడినట్లు అయింది.వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అన్ని రకాల నిర్మాణాల్లో భారతి సిమెంట్స్ వాడారు అనేది ఇప్పుడు బయటకు వచ్చింది. హెరిటేజ్ పై చర్చించే క్రమంలో సీఎం చంద్రబాబు ఫుల్ క్లారిటీ ఇచ్చారు. ప్రభుత్వ శాఖల్లో ఎప్పుడూ హెరిటేజ్ ఉత్పత్తులను వాడలేదని తేల్చి చెప్పారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ నిర్మాణాల్లో భారతి సిమెంట్స్ వాడారని చెప్పుకొచ్చారు. అయితే ఇది ప్రజల్లోకి బలంగా వెళ్తోంది. వైసిపి ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయాలను, రైతు భరోసా కేంద్రాలను నిర్మించారు. జగనన్న కాలనీల పేరుట గృహ నిర్మాణం చేపట్టారు. మరికొన్ని ప్రభుత్వ నిర్మాణాలు కూడా జరిగాయి. అయితే వీటి పనుల కోసం సిమెంట్ కొనేటప్పుడు తక్కువ ధర కోట్ చేసిన సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలి. కానీ జగన్మోహన్ రెడ్డి మాత్రం తన అధికార బలంతో మార్కెట్ ధర కంటే ఎక్కువ రేటుకు తన సొంత కంపెనీ దగ్గరే సిమెంట్ కొనేలా ఒప్పందాలు చేసుకున్నట్లు ఆధారాలు బయట పెట్టింది కూటమి ప్రభుత్వం. తద్వారా అప్పటి ప్రభుత్వ ఖజానాకు భారీగా గండిపడటమే కాకుండా.. ఇతర సిమెంట్ కంపెనీలకు అన్యాయం జరిగిందనే వాదనను తెరపైకి తెస్తున్నారు టిడిపి నాయకులు.వైసిపి హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణంలో భారతి సిమెంట్స్ వాటా ఎక్కువగా ఉండేలా ప్లాన్ చేసినట్లు ఇప్పుడు బయటపడింది. మిగిలిన సిమెంట్ కంపెనీల కంటే మూడు రెట్లు ఎక్కువగా ఆర్డర్లు ఇచ్చి.. తన సంస్థ వృద్ధిరేటును పెంచుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఇప్పుడు ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్రవృద్ధి రేటు కంటే తన సొంత కంపెనీ ఆస్తులు ఎలా పెరగాలనే దానిపై జగన్ దృష్టి పెట్టారని ప్రజల్లో చర్చ జరుగుతుంది. మరోవైపు ఈ కంపెనీకి సంబంధించిన సున్నపు గనుల లీజు వ్యవహారంలో కూడా అక్రమాలు జరిగాయని ఆరోపణలు రావడంతో.. వాటిపై కూడా ప్రభుత్వం పూర్తిగా దృష్టి పెట్టింది. ఆ లీజులను రద్దు చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. అధికారులు రికార్డులను పూర్తిగా పరిశీలిస్తున్నారు.మద్యం కుంభకోణం లింకులు కూడా భారతి సిమెంట్స్ కు ఉన్నాయి. ఆ కంపెనీ డైరెక్టర్ గా ఉన్న బాలాజీ గోవిందప్ప మద్యం కుంభకోణంలో అరెస్టు అయ్యారు. కేవలం హెరిటేజ్ పై అవినీతి మరక అంటించేందుకు జగన్ ప్రయత్నాలు చేశారు. కానీ ఇప్పుడు ఏకంగా భారతి సిమెంట్స్ అవినీతి పుట్ట తవ్వేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమయింది. ఇప్పటికే వేట ప్రారంభించింది. నెయ్యి కల్తీ ఎపిసోడ్ ఒకవైపు ఉంటూనే.. భారతి సిమెంట్ ఎపిసోడ్ మొదలుకానుంది అన్నమాట.

# నాయకత్వ లోపం కాదు.. సలహాల విషం

విజయవాడ, ఫిబ్రవరి 26



ఒకప్పుడు జనంలోకి వెళ్లినప్పుడు జగన్ మోహన్ రెడ్డి ఎంతో ఆత్మవిశ్వాసంతో మాట్లాడేవారు. పాదయాత్ర సమయంలో లక్షలాది మంది ముందు పేపర్ చూడకుండా గంటల తరబడి ప్రసంగించిన సందర్భాలు ఉన్నాయి. అప్పట్లో ఆయన మాటల్లో ఒక స్పష్టత, వేగం ఉండేవి. కానీ ఇప్పుడు సీన్ పూర్తిగా మారింది. చివరకు అందరికీ నమస్కారం అనాలన్నా లేదా లోకేష్ క్రికెట్ మ్యాచ్ చూడటం వంటి చిన్న విషయాలపై విమర్శలు చేయాలన్నా స్క్రిప్ట్ వైపు చూడాల్సి రావడం వెనుక ఏదో పెద్ద కుట్ర ఉందనే అనుమానం పార్టీ వీరాభిమానుల్లో మొదలైందిజగన్ రెడ్డికి ఏమీ తెలియదనే భ్రమను ఆయనే నమ్మేలా చేయడంలో సజ్జల రామకృష్ణారెడ్డి అండ్ టీమ్ సక్సెస్ అయిందనేది క్యాడర్ ప్రధాన ఆరోపణ. నువ్వు ఏదైనా తప్పు మాట్లాడితే పరువు పోతుంది.. ప్రత్యర్థులు ట్రోల్ చేస్తారు అని భయపెట్టి, ఆయనలోని సహజ సిద్ధమైన నాయకత్వ లక్షణాలను చంపేశారని కార్యకర్తలు భావిస్తున్నారు. ఈ అతి జాగ్రత్తే జగన్‌ను ఒక రీడింగ్ మెషిన్ గా మార్చేసింది. సొంతంగా ఆలోచించి మాట్లాడే శక్తి లేదనే ముద్ర పడేలా చేయడంలో సజ్జల క్యాంప్ వ్యూహం పక్కాగా అమలు జరుగుతోందనిపిస్తోందని వైసీపీ కార్యకర్తలు సోషల్ మీడియాలో భగ్గుమంటున్నారు.రాజకీయాల్లో మాట తీరు చాలా ముఖ్యం. కానీ జగన్ రెడ్డి ప్రతి అక్షరాన్ని పేపర్ చూసి చదవడం వల్ల ఆయన సహజత్వం కోల్పోయారు. లోకేష్ కొలంబో వెళ్లడం వంటి అతి సామాన్యమైన అంశాలను కూడా చూసి చదవడం చూస్తుంటే.. అది జగన్ రెడ్డి వైఫల్యం కంటే, ఆయన చుట్టూ ఉన్న సలహాదారుల వైఫల్యమే అనిపిస్తుంది. నాయకుడిని ఒక రబ్బర్ స్టాంప్‌లా మార్చి, తామే సర్వస్వం అన్నట్టుగా సజ్జల వ్యవహరించడం వల్ల పార్టీ ఇమేజ్ గ్రౌండ్ లెవల్‌లో దారుణంగా పడిపోయిందన్న అభిప్రాయం వినిపిస్తోంది.పార్టీ కోసం ప్రాణాలు ఇచ్చే కరడుగట్టిన కార్యకర్తలు సైతం ఈ మార్పును జీర్ణించుకోలేకపోతున్నారు. జగన్ రెడ్డికి తెలియకుండానే ఆయనను ఒక బందీగా మార్చేశారని, ప్రతి చిన్న విషయానికి సలహాదారులపై ఆధారపడేలా చేయడం వెనుక లోతైన రాజకీయ కుట్ర దాగి ఉందనే చర్చ సాగుతోంది. జగన్ రెడ్డి ఇమేజ్‌ను టార్నిష్ చేసి, ఆయనను జనానికి దూరం చేయడమే సజ్జల అంతిమ లక్ష్యమా అనే ప్రశ్నలు ఇప్పుడు వైసీపీ సర్కిల్స్‌లో గట్టిగా వినిపిస్తున్నాయినిజానికి జగన్ రెడ్డికి ఉన్న వాగ్ధాటి గురించి అందరికీ తెలుసు. కానీ అధికారంలోకి వచ్చాక ఆయన చుట్టూ చేరిన కోటరీ ఆయనను ఒక చదువరీ గా మార్చేసింది. ప్రజల కళ్ళలోకి చూసి మాట్లాడాల్సిన నాయకుడు, పేపర్ల వైపు చూస్తూ మాట్లాడటం వల్ల ఓటర్లతో కనెక్ట్ తగ్గిపోయింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, జగన్ రెడ్డి తన స్వయం ప్రతిపత్తిని కోల్పోయి, కేవలం సలహాదారుల చేతిలో కీలుబొమ్మగా మిగిలిపోతారనే ఆందోళన పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.

# పెద్దిరెడ్డి ఫ్యామిలీ గుడ్ బై

తిరుపతి ఫిబ్రవరి 26,

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఒక బలమైన లీడర్ గుడ్ బై చెబుతారా? వ్యూహాత్మకంగా సైలెన్స్ పాటిస్తున్నారా? అధినేత వైఖరి నచ్చడం లేదా? లేకుంటే కూటమి ప్రభుత్వం దూకుడు కారణమా? పొలిటికల్ వర్గాల్లో ఇదే చర్చ నడుస్తోంది. ఇంతకీ ఎవరో నేత అంటే చిత్తూరు జిల్లాకు చెందిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో బలమైన నేతగా ఉన్నారు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. మొన్నటి కూటమి ప్రభంజనాన్ని కూడా తట్టుకున్నారు. తాను ఒక్కడిని గెలవడమే కాదు తన సోదరుడు ద్వారకానాథ్ రెడ్డి ని తంబళ్లపల్లె నుంచి గెలిపించుకున్నారు. కుమారుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి రాజంపేట ఎంపీ గాను గెలిచారు. అయితే మారిన పరిస్థితుల నేపథ్యంలో పెద్దిరెడ్డి ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెబుతుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది.వైయస్ రాజశేఖర్ రెడ్డి కి అత్యంత సన్నిహితుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. ఆ సాన్నిహిత్యం తోనే జగన్మోహన్ రెడ్డి వెంట అడుగులు వేశారు పెద్దిరెడ్డి. గత దశాబ్ద కాలంగా బలమైన, తిరుగులేని నేతగా ఎదిగారు. పార్టీ తరఫున రాయలసీమ బాధ్యతలను జగన్మోహన్ రెడ్డి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కి అప్పగించారు. అయితే వైసిపి అధికారంలో ఉన్నప్పుడు దూకుడు ప్రదర్శించిన పెద్దిరెడ్డి ఫ్యామిలీ ఇప్పుడు క్రమేపి పార్టీ కార్యకర్తలకు దూరంగా ఉంటుంది. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆ కుటుంబం రాజీనామా చేయబోతోందా? అనే చర్చ రాజకీయ వర్గాల్లో ప్రారంభం అయింది. ప్రస్తుతం ఆ ఫ్యామిలీ ఎదుర్కొంటున్న న్యాయపరమైన సమస్యలు చూస్తుంటే మాత్రం పార్టీ మారుతారని బలమైన ప్రచారం జరుగుతోంది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత పెద్దిరెడ్డి ఫ్యామిలీతో పాటు వారి అనుచరుల వ్యాపారాలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. గతంలో పెద్దిరెడ్డి మాటే శాసనం అన్నట్టు ఉండేది. కానీ ఇప్పుడు పూర్తిగా సీన్ మారిపోయింది.మద్యం కుంభకోణంలో పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్ట్ అయ్యారు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో సుదీర్ఘకాలం రిమాండ్ ఖైదీగా ఉండిపోయారు. అటు తర్వాత పెద్దిరెడ్డి పై సైతం అనేక కేసులు తెరపైకి వచ్చాయి. ఈ పరిస్థితుల్లో దూకుడు కంటే మౌనం పాటించడమే మేలన్న నిర్ణయానికి పెద్దిరెడ్డి ఫ్యామిలీ వచ్చినట్లు తెలుస్తోంది. అయితే చివరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం పిలుపు ఇచ్చిన కార్యక్రమాలను సైతం నిర్వహించలేని పరిస్థితి ఆ ఫ్యామిలీది. పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండటంతో జగన్ సైతం ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని వెతుక్కుంటున్నట్లు సమాచారం. అందుకే పెద్దిరెడ్డి తన దారి తాను చూసుకునే పనిలో ఉన్నారని లీకులు బయటకు వస్తున్నాయి. సాధారణంగా పెద్దిరెడ్డి లాంటి సీనియర్ నేత బయటకు వెళ్లిపోతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చాలా నష్టం. కోలుకోలేని దెబ్బ కూడా. అయితే తనపై ఉన్న కేసుల ఒత్తిడి, వ్యాపార ప్రయోజనాల దృష్ట్యా.. పెద్దిరెడ్డి కూటమి వైపు వెళ్తారా? లేకుంటే స్వతంత్రంగా వ్యవహరిస్తారా? అన్నది తెలియాల్సి ఉంది. అయితే ఏదో ఒక నిర్ణయం తీసుకుంటారు అనేది చిత్తూరు జిల్లా పొలిటికల్ వర్గాల్లో బలమైన చర్చ నడుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# అసెంబ్లీ వేదికగా రాజకీయ కురుక్షేత్రం

విజయవాడ, ఫిబ్రవరి 26, (న్యూస్ పల్స్)

కల్తీ నెయ్యి వ్యవహారంపై ఏపీ అసెంబ్లీ వేదికగా రాజకీయ కురుక్షేత్రం మొదలుకానుంది. ప్రభుత్వం ఈ అంశాన్ని అత్యంత ప్రతిష్టాత్మకగా తీసుకుని, వాస్తవాలను ప్రజల ముందు ఉంచేందుకు వ్యూహరచన చేసింది. తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా గత ప్రభుత్వ హయాంలో జరిగిన నెయ్యి కల్తీ వ్యవహారం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో చిచ్చు రేపుతోంది. ఈ సున్నితమైన అంశంపై శాసనసభలో సుదీర్ఘ చర్చకు రంగం సిద్ధమైంది. కేవలం ఆరోపణలతో సరిపెట్టకుండా, ఆధారాలతో సహా వైసీపీ వైఫల్యాలను ఎండగట్టాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించుకుంది.వైసీపీ అధికారంలోకి రాగానే చేసిన నెయ్యి కల్తీ నుంచి అ నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ఇచ్చిన నివేదికతో సహా ప్రస్తుతం విచారణ జరుపుతున్న ఏకసభ్య కమిషన్ వరకు ప్రతి అంశాన్ని ప్రభుత్వం సభ ముందు ఉంచనుంది. గత ప్రభుత్వ హయాంలో హిందూ ధర్మానికి, భక్తుల మనోభావాలకు జరిగిన ద్రోహాన్ని సాక్ష్యాధారాలతో నిరూపించడమే లక్ష్యంగా పాలకపక్షం అడుగులు వేస్తోంది. టెండర్ల ప్రక్రియలో జరిగిన లోపాలు, తక్కువ ధరకు నెయ్యి సరఫరా వెనుక ఉన్న మతలబులను బయటపెట్టడం ద్వారా ప్రతిపక్షాన్ని ఇరుకున పెట్టాలని భావిస్తోంది. తప్పును ఒప్పుకోకుండా తిరిగి హెరిటేజ్ సంస్థపై, ముఖ్యమంత్రి కుటుంబంపై వైసీపీ చేస్తున్న ఎదురుదాడిని తిప్పికొట్టేందుకు అసెంబ్లీని సరైన వేదికగా ప్రభుత్వం భావిస్తోంది.ప్రస్తుత పరిస్థితుల్లో వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చే ధైర్యం చేస్తారా అన్నది చర్చనీయాంశంగా మారింది. సభలో చర్చ జరిగితే వాస్తవాలు బయటకు వస్తాయని, అది తమ రాజకీయ మనుగడకే ప్రమాదమని వారు ఆందోళన చెందుతున్నారు. శాసనసభకు గైర్హాజరై, శాసనమండలిలో మాత్రం నిరసనల పేరుతో కాలయాపన చేసి బయటకు వెళ్లిపోయే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. చర్చలో పాల్గొంటే సమాధానం చెప్పుకోలేక, పాల్గొనకపోతే పారిపోయారన్న ముద్ర పడుతుందన్న సందిగ్ధంలో ఆ పార్టీ నేతలు ఉన్నారు.హిందూ ధర్మంపై దాడులు జరుగుతున్నా చూస్తూ ఊరుకుంటే అది మరిన్ని అనర్థాలకు దారితీస్తుందని ప్రభుత్వం గట్టిగా నమ్ముతోంది. భక్తుల మనోభావాలతో ఆడుకున్న వారిని చట్టపరంగానే కాకుండా, రాజకీయంగా కూడా ప్రజల ముందు దోషులుగా నిలబెట్టాలని చూస్తోంది. అందుకే ఈ వారంలోనే శాసనసభతో పాటు శాసనమండలిలో కూడా దీనిపై చర్చను చేపట్టాలని నిర్ణయించింది. ప్రజలకు అసలు నిజాలు తెలిస్తేనే తప్పుడు ప్రచారాలకు అడ్డుకట్ట పడుతుందని కూటమి నేతలు భావిస్తున్నారు. ప్రజలకు నిజాలు తెలియచేయడమే లక్ష్యంగా శాసనసభలో చర్చలు జరగనున్నాయి.

# బాలయ్య, నాగబాబులకు మంత్రి పదవులు..?

విజయవాడ, ఫిబ్రవరి 26

పొలిటికల్ గ్యాసిప్స్ అనేవి సర్వసాధారణం. ఎన్నికలతో పని లేకుండా ఇవి వినిపిస్తూనే ఉంటాయి. ఇప్పుడు నందమూరి బాలకృష్ణ విషయంలో ఒక వార్త వైరల్ అవుతోంది. త్వరలో నందమూరి బాలకృష్ణకు మంత్రి పదవి ఇవ్వబోతున్నారు అన్నది ఈ వార్త సారాంశం. త్వరలో మంత్రివర్గ విస్తరణ ఉన్న నేపథ్యంలో నందమూరి బాలకృష్ణ కు మంత్రి పదవి ఇవ్వబోతున్నారనే వార్త



పొలిటికల్ వర్గాల్లో హల్చల్ చేస్తోంది. అదే జరిగితే నందమూరి అభిమానులకు శుభవార్త. అయితే అదే సమయంలో కొన్ని రకాల సమీకరణల దృష్ట్యా.. బాలకృష్ణ కు మంత్రి పదవి ఇవ్వడం సాధ్యమేనా అనే చర్చ నడుస్తోంది.ఏపీ రాజకీయాలతో పాటు సినిమా రంగాల్లో నందమూరి కుటుంబానికి ప్రత్యేక స్థానం. ఎన్టీఆర్ నట వారసుడిగా తెరపైకి వచ్చారు బాలకృష్ణ. సినిమా రంగంలో తనకంటూ ఒక ముద్ర చాటుకున్నారు. రాజకీయాల్లోకి కూడా వచ్చారు. 2014 నవ్యాంధ్రప్రదేశ్ ఎన్నికల్లో తొలిసారిగా హిందూపురం నుంచి పోటీ చేసి గెలిచారు. హిందూపురం అంటే నందమూరి కుటుంబానికి పెట్టని కోట. అటువంటి చోట హ్యాట్రిక్ విజయం సాధించారు నందమూరి బాలకృష్ణ. ముచ్చటగా మూడోసారి గెలిచేసరికి బాలకృష్ణ కు మంత్రి పదవి దక్కుతుందని అంతా భావించారు. కానీ అటువంటిదేమీ లేకుండా పోయింది.తెలుగుదేశం పార్టీలో నందమూరి ఫ్యామిలీకి సరైన ప్రాధాన్యత లేకుండా పోయిందన్న విమర్శ రాజకీయ ప్రత్యర్థుల నుంచి వినిపిస్తూ ఉంటుంది. కానీ అటువంటిదేమీ పట్టించుకోరు నందమూరి బాలకృష్ణ. తన సినిమాలు తాను చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఎంత బిజీగా ఉన్నా హిందూపురం నియోజకవర్గానికి మాత్రం దగ్గరగానే ఉంటారు. ఇటీవల బాలకృష్ణ భార్య వసుంధర దేవి సైతం తరచూ హిందూపురం నియోజకవర్గంలో పర్యటిస్తూ వస్తున్నారు. బాలకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలని హిందూపురం నియోజకవర్గం ప్రజలతో పాటు నందమూరి కుటుంబాభిమానులు కోరుతూ వచ్చారు. అయితే ఇప్పటికే క్యాబినెట్లో బాలకృష్ణ అల్లుడు నారా లోకేష్ మంత్రిగా ఉన్నారు. బావ చంద్రబాబు సీఎం గా ఉన్నారు. బాలకృష్ణ కు మంత్రి పదవి ఇస్తే రాజకీయ ప్రత్యర్థులు తప్పుడు ప్రచారం చేస్తారన్న ఆలోచన చంద్రబాబులో ఉంది. ఇటువంటి నేపథ్యంలో నందమూరి బాలకృష్ణ కు మంత్రి పదవి ఇస్తారా? అనేది ఒక అనుమానం.త్వరలో మెగా బ్రదర్ నాగబాబును మంత్రి వర్గంలోకి తీసుకుంటామని సీఎం చంద్రబాబు స్వయంగా ప్రకటించారు. అందుకు తగ్గట్టుగానే నాగబాబును ఎమ్మెల్సీ చేశారు. విస్తరణలో ఆయనకు మంత్రి పదవి ఖాయం. అయితే మెగా కుటుంబంలో ఇద్దరికి ఇచ్చి.. నందమూరి కుటుంబంలో ఒకే ఒక్కడుగా ఉన్న బాలకృష్ణకు ఇవ్వకపోతే ఇబ్బందికర పరిస్థితులు వస్తాయని అంచనాలు ఉన్నాయి. పైగా నందమూరి కుటుంబాన్ని చంద్రబాబు పట్టించుకోవడం లేదన్న విమర్శకు బాలకృష్ణకు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా చెక్ చెప్పవచ్చు. అందుకే ఈసారి మంత్రి పదవి బాలకృష్ణ కు ఖాయం అన్న ప్రచారం పొలిటికల్ వర్గాల్లో నడుస్తోంది. వీలైనంత త్వరగా పెండింగ్ సినిమాలు పూర్తి చేసి.. రాజకీయంగా యాక్టివ్ కావాలని చూస్తున్నారు బాలకృష్ణ. మెగా ఫ్యామిలీతో పాటు నందమూరి కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా.. ఆ రెండు కుటుంబ అభిమానులతో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు చంద్రబాబు స్కెచ్ వేసినట్లు ప్రచారం నడుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి

# తెలుగు రాష్ట్రాల మధ్య తొలి హైటెక్ హైవే

హైదరాబాద్, ఫిబ్రవరి 26,

తెలుగు రాష్ట్రాల మధ్య రాకపోకలు సాగించే వారికి గుడ్‌న్యూస్. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి విశాఖ వెళ్లే వాహనదారులు ఎగిరిగంతేసే వార్త. ఎందుకంటే త్వరలోనే మరో కొత్త హైవే అందుబాటులోకి రానుంది. ఖమ్మం-దేవరపల్లి మధ్య హైటెక్ హంగులతో నిర్మించిన హైవేను మే నెలలో ప్రారంభించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ ఏర్పాట్లు చేస్తోంది. ఈ హైవే అందుబాటులోకి వస్తే హైదరాబాద్-విశాక 56 కి.మీ దూరం తగ్గనుంది.తెలంగాణ-ఏపీ మధ్య ప్రయాణాలు సాగించేవారికి గుడ్‌న్యూస్. త్వరలోనే మరో గ్రీన్‌ఫీల్డ్ హైవే అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం హైదరాబాద్-విజయవాడ, హైదరాబాద్-శ్రీశైలం నేషనల్ హైవేలపై రాకపోకలు సాగిస్తున్నారు. ఈ హైవేలపై రద్దీ పెరగటంతో తెలుగు రాష్ట్రాలను కలుపుతూ మరో హైవేను నిర్మించారు. ఖమ్మం-ఏపీలోని దేవరపల్లి మధ్య నిర్మించిన మొదటి యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే త్వరలోనే వాహనదారులకు అందుబాటులోకి రానుంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో హైటెక్ హంగులతో నాలుగు వరుసలుగా ఈ రోడ్డు రెడీ అవుతోంది.తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం అనేక గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవేలు నిర్మాణంలో ఉన్నాయి. వీటిలో మొదటిదిగా.. తెలంగాణలోని ఖమ్మం నుంచి ఏపీలోని దేవరపల్లి వరకు 162.04 కి.మీ. పొడవున చేపట్టిన ఈ రహదారికి ఎన్‌హెచ్‌ఏఐ తుదిమెరుగులు దిద్దుకుంటోంది. హైదరాబాద్ నగరం నుంచి విశాఖపట్నం వెళ్లాలంటే ప్రస్తుతం ఎన్‌హెచ్ 65పై సూర్యాపేట, విజయవాడల మీదుగా 676 కిలో మీటర్ల ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ కొత్త హైవే అందుబాటులోకి వస్తే 56 కి.మీ తగ్గనుంది. ఖమ్మం సమీపంలోని తల్లంపాడు నుంచి ఏపీలోని ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల మీదుగా దేవరపల్లి వరకు ఈ రోడ్డును నిర్మిస్తుండగా.. ఎన్‌హెచ్-365బీజీగా ఈ రహదారికి నంబరును కేటాయించారు.ఇక ఈ హైవే హెటెక్ హంగులతో రూపుదిద్దుకుంటోంది. సీసీ కెమెరాలు, సోలార్ ప్యానళ్లు, సమాచారాన్ని అందించే క్యూఆర్ కోడ్‌లు, అత్యాధునిక రవాణా నిర్వహణ వ్యవస్థ, ఎమర్జెన్సీ మీడియన్ ఓపెనింగ్స్ వంటివి ఏర్పాటు చేశారు. ప్రయాణించిన దూరానికే టోల్ వసూళ్లు చేయనున్నారు. పరిమిత సంఖ్యలో అంటే 19 చోట్ల మాత్రమే ఎంట్రీ, ఎగ్జిట్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. దానికి తోడు ప్రతి 50 కి.మీ రోడ్డుకు రెండు వైపులా దాదాపు 5 ఎకరాల్లో స్థలంలో వాహనదారులు సేదతీరేందుకు ప్రత్యేక స్థలం కేటాయించారు. ఇందులో హోటళ్లు, రెస్టారెంట్లు, టాయిలెట్స్, పెట్రోల్ బంకులు వంటి సౌకర్యాలు ఉంటాయి. హైవేపై ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేయటం ద్వారా మీరున్న లోకేషన్, దగ్గర్లోనే పోలీస్ స్టేషన్లు, పెట్రోల్ బంకులు, హాస్పిటల్స్ వంటి సమాచారం తెలుసుకోవచ్చు.ఇప్పటి వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ రహదారి ఒక్కటి కూడా లేదు. ఖమ్మం దేవరపల్లి హైవే అందుబాటులోకి వస్తే ఇదే మొదటిది అవుతుంది. ఈ రహదారిని ఈ ఏడాది మేలో ప్రారంభించడానికి ఎన్‌హెచ్‌ఏఐ ఏర్పాట్లు చేస్తోంది.

# ఎన్ సీఈఆర్టీ బుక్ పై సుప్రీం ఆగ్రహాం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26

ఎన్‌సీఈఆర్టీ 8వ తరగతి పాఠ్య పుస్తకంలో అవినీతి గురించి ఓ అంశం చేర్చింది. అయితే, న్యాయవ్యవస్థ గురించి గతంలో మాజీ సీజేఐ చేసిన వ్యాఖ్యలను ఉటంకించడం గమనార్హం. దీనిపై తీవ్ర దుమారం రేగుతోంది. అసలు రాజకీయాలే అవినీతిక కేరాఫ్ అడ్రస్ అని, అలాంటప్పుడు వాటి గురించి ఎందుకు పుస్తకంలో పేర్కొనలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశం సుప్రీంకోర్టు దృష్టికి రాగా.. సీజేఐ కూడా తీవ్రంగా స్పందించారు. ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు.ఎనిమిదో తరగతి సిలబస్‌లో న్యాయవ్యవస్థలో అవినీతి ' ఓ పాఠ్యాంశంగా ప్రవేశపెట్టడంపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. జాతీయ విద్య పరిశోధన శిక్షణ సంస్థ తీరుపై సుప్రీంకోర్టు మండిపడింది. ఇది అందర్నీ కలవరానికి గురిచేసిందని, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలను సహించబోమని తేల్చిచెప్పింది. న్యాయస్థానం ఏ సంస్థను, ఏ వ్యక్తిని కించపరచడానికి అనుమతించదని, ఈ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. కొన్ని రోజులు ఆగితే దీనిపై సుమోటోగా విచారణ చేపడతామని పేర్కొన్నారు. ఈ అంశాన్ని సుప్రీంకోర్టు దృష్టికి సీనియర్ న్యాయవాది, ఎంపీ కపిల్ సిబల్ తీసుకొచ్చారు. ఎన్సీఆర్టీ 8వ తరగతిలో న్యాయవ్యవస్థలో అవినీతి గురించి బోధిస్తోందని వివరించారు. ఈ నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం నుంచి స్పందన వచ్చింది.సుప్రీంకోర్టు స్పందన నేపథ్యంలో పాఠ్య పుస్తకం నుంచి ఈ అంశాన్ని ఎన్సీఈఆర్టీ తొలగించనున్నట్టు ఉన్నతస్థాయి ప్రభుత్వ వర్గాలు బుధవారం వెల్లడించాయి. "దీనిని చేర్చి ఉండకూడదు..

అటువంటి అంశాలను హైలైట్ చేయడం సముచితం కాదు.. బదులుగా స్ఫూర్తిదాయకమైన విషయాలు పొందుపరిచి ఉండాల్సింది'' కేంద్ర ప్రభుత్వ వర్గాలు ప్రకటించాయి.. న్యాయవ్యవస్థలో అవినీతి, దుష్ప్రవర్తన ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తాయని, ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయన్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ జులై 2025లో చేసిన వ్యాఖ్యలను పాఠ్యాంశంలో ప్రస్తావించారు. "ప్రజలకు విశ్వాసం కల్పించడానికి పారదర్శకత, జవాబుదారీతనం ప్రజాస్వామ్య ధర్మాలు" అని ఆయన అన్న వ్యాఖ్యలను పుస్తకంలో ఉటంకించారు. సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసిన కొద్దిసేపటికే ప్రభుత్వ వర్గాలు ఈ అంశంపై స్పందించాయి.'ఎన్సీఆర్టీ 8వ తరగతి పాఠ్య పుస్తకంలో న్యాయవ్యవస్థలో అవినీతి అనే అంశాన్ని పాఠంగా జోడించింది. మరి మంత్రులు, ప్రజా సేవకులు,దర్యాప్తు సంస్థలు సహా రాజకీయ నాయకులు భారీ అవినీతి సంగతి ఏంటి? వాటిని ఎందుకు పక్కనబెట్టాలి' అని కపిల్ సిబల్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. అయితే, కాగా, కొద్ది రోజుల కిందట 2016 నుంచి 2025 మధ్య సుప్రీంకోర్టు, హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తులపై సుప్రీంకోర్టుకు 7,520 ఫిర్యాదు అందింనట్టు న్యాయశాఖ నివేదిక విడుదల చేయడం గమనార్హం.

దీనిపై సీనియర్ అభిషేక్ మను సింఘ్వీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇతర రంగాల్లో అవినీతిని పక్కనబెట్టి కేవలం న్యాయవ్యవస్థనే వేలెత్తి చూపుతున్నారని మండిపడ్డారు.పాఠశాల స్థాయిలో విద్యలో పిల్లలకు విద్యావంతులను చేయాల్సింది పోయి ఇలాంటి సంక్లిష్టమై అంశాలను చేర్చడం ఏంటి? అని సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూత్రా ప్రశ్నించారు. ఎనిమిదో తరగతిలో, విద్యార్థులకు పాలనా విభాగాలు, వాటి విధులను పరిచయం చేయడమే ముఖ్య ఉద్దేశ్యం అని ఆయన అన్నారు.

# బీఆర్ఎస్ వ్యూహాత్మక మౌనం

హైదరాబాద్, ఫిబ్రవరి 26,



తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ప్రస్తుతం ఆసక్తికరమైన మలుపు తిరుగుతోంది. కాంగ్రెస్, బీజేపీ మధ్య సాగుతున్న ప్రత్యక్ష పోరాటాలు ప్రజాక్షేత్రంలో హోరెత్తుతుంటే, ప్రధాన ప్రతిపక్షంగా ఉండాల్సిన బీఆర్ఎస్ వ్యూహాత్మక మౌనం పాటిస్తోందనే చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో ప్రధాన పోటీ తమ మధ్యే అన్నట్లుగా కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు వీధి పోరాటాలకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. కామారెడ్డిలో మొదలైన నిరసన జ్వాలలు క్రమంగా రాష్ట్రమంతటా విస్తరించడం చూస్తుంటే.. ప్రజల్లో ఇతర ప్రత్యామ్నాయం లేదనే భావన కలిగించడం ఈ రెండు పార్టీల ఉమ్మడి ఎత్తుగడగా కనిపిస్తోంది. క్షేత్రస్థాయి సమస్యలపై ఈ రెండు పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకుంటూ వార్తల్లో నిలుస్తుండటంతో రాజకీయం అంతా వారి చుట్టూనే తిరుగుతోంది.మరోవైపు బీఆర్ఎస్ అధినాయకత్వం ప్రస్తుతానికి కొంత వెనక్కి తగ్గినట్లు కనిపిస్తున్నా, అది ముందస్తు వ్యూహంలో భాగమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు బీజేపీ వైపు మళ్లకుండా ఉండేందుకు, అధికార పక్షం వైఫల్యాలను ఎండగట్టే సరైన సమయం కోసం వేచి చూసే ధోరణిని గులాబీ దళం అనుసరిస్తోంది. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, ప్రభుత్వ పథకాల అమలులో లోపాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం ద్వారా మళ్ళీ రేసులోకి రావాలని ప్లాన్ చేస్తోంది.కేవలం మౌనంగా ఉంటే ఇతర పార్టీల దూకుడు పెరిగి తమ ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది. దీనిని అధిగమించేందుకు త్వరలోనే పార్టీ అధిష్టానం నియోజకవర్గాల వారీగా భారీ బహిరంగ సభలు, పాదయాత్రలు లేదా ఇతర ఆందోళన కార్యక్రమాలకు రూపకల్పన చేసే అవకాశం ఉంది. కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా క్యాడర్‌ను ఉత్తేజితం చేసేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు సమాచారంఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్‌కు కొంత హెచ్చరికగా మారాయి. కాంగ్రెస్ తన పట్టును నిరూపించుకోగా, బీజేపీ కొన్ని పట్టణ ప్రాంతాల్లో పుంజుకుంది. ఈ ఫలితాల తర్వాత బీఆర్ఎస్ తన శైలిని మార్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఓటర్ల నాడిని పట్టుకోవడంలో ఎక్కడ విఫలమయ్యామనే అంశంపై ఇప్పటికే అంతర్గత సమీక్షలు ప్రారంభమయ్యాయి. స్థానిక నేతలను సమన్వయం చేసుకుంటూ ప్రజల్లోకి వెళ్లడమే తదుపరి లక్ష్యంగా కనిపిస్తోంది.బీఆర్ఎస్ మళ్లీ తన ప్రాభవాన్ని చాటుకోవాలంటే కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, నిర్మాణాత్మక పోరాటాలు చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా నీళ్లు, నిధులు, నియామకాల అంశంపై మరోసారి గళం విప్పడం ద్వారా తెలంగాణ అస్తిత్వ కార్డును వాడే అవకాశం ఉంది. కాంగ్రెస్ వైఫల్యాలను, బీజేపీ రాజకీయాలను ఒకేసారి టార్గెట్ చేస్తూ తెలంగాణ రక్షించే పార్టీ అనే నినాదంతో ముందుకు వెళ్తేనే తిరిగి ఆ రెండు పార్టీలకు ధీటైన పోటీ ఇచ్చే అవకాశం ఉంటుంది.

# క్షేత్రస్థాయిపై దృష్టి

హైదరాబాద్, ఫిబ్రవరి 26

తెలంగాణ రాజకీయాల్లో పదిహేనేళ్ల పాటు తిరుగులేని శక్తిగా వెలిగిన భారత్ రాష్ట్ర సమితి ఇప్పుడు తిరిగి పూర్వ వైభవం కోసం నిశ్శబ్దంగా పావులు కదుపుతోంది. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత కొంతకాలం మౌనంగా ఉన్న అధినేత కేసీఆర్, ఇప్పుడు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు సరికొత్త వ్యూహాలను అమలు చేయనున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత కార్యకర్తల్లో నెలకొన్న నైరాశ్యాన్ని పోగొట్టడంపై కేసీఆర్ ప్రధానంగా దృష్టి సారించారు. నియోజకవర్గాల వారీగా కీలక నేతలతో టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ, ఓటమికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. పార్టీ శ్రేణులకు అండగా ఉంటామనే నమ్మకాన్ని కలిగిస్తూనే, ప్రభుత్వం చేస్తున్న పొరపాట్లను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేస్తున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేలా ప్రత్యేక బృందాలను సిద్ధం చేశారు.రాజకీయాలు వేగంగా మారుతున్నా కేసీఆర్ ఏమాత్రం తొందరపడకుండా వ్యవహరిస్తున్నారు. వెళ్లే వారిని అడ్డుకోకుండా, మిగిలి ఉన్న నిబద్ధత గల నాయకులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పదవుల కోసం పార్టీ మారే వారితో పోలిస్తే, సిద్ధాంతం కోసం నిలబడే వారే పార్టీకి అసలైన బలమని ఆయన భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ద్వితీయ శ్రేణి నాయకత్వానికి పెద్దపీట వేస్తూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వారిని సమాయత్తం చేస్తున్నారు. దీనికోసం ప్రతి మండలానికి ఒక ఇన్‌ఛార్జ్‌ను నియమించి కొత్త రక్తాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించారు.గతంలో తెలంగాణ సెంటిమెంట్ మీద ఎక్కువగా ఆధారపడిన బీఆర్ఎస్, ఇప్పుడు ప్రజా సమస్యల మీద గొంతు ఎత్తుతోంది. నిరుద్యోగ భృతి, రైతు రుణమాఫీ, పెన్షన్ల పంపిణీలో జరుగుతున్న జాప్యం వంటి అంశాలను అస్త్రాలుగా మార్చుకుంటోంది. ప్రజల పక్షాన నిలబడి పోరాడటం ద్వారా కోల్పోయిన ప్రజాధారణను మళ్ళీ పొందవచ్చని కేసీఆర్ గట్టిగా విశ్వసిస్తున్నారు. శాసనసభలో కూడా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా వ్యూహకర్తలతో కలిసి నిరంతర చర్చలు జరుపుతున్నారు. ఓ వైపు తెలంగాణ సెంటిమెంట్ తో పాటు ప్రజా సమస్యలను కూడా ఎక్కువగా తెరపైకి తెచ్చి పోరాడాలని భావిస్తున్నారు.బయటకు పెద్దగా కనిపించకపోయినా, ఎర్రవెల్లి ఫామ్ హౌస్ కేంద్రంగా కేసీఆర్ రాజకీయ చదరంగం నడుపుతున్నారు. ఎప్పుడు ఏ అడుగు వేయాలో తెలిసిన ఆయన, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నారు. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైనప్పుడు దాన్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. ఒకప్పుడు ఉద్యమ నేతగా పార్టీని ఎలా నిర్మించారో, ఇప్పుడు కూడా అదే పట్టుదలతో పునర్నిర్మాణ బాధ్యతలు చేపట్టారు.సరైన సమయం చూసి బీఆర్ఎస్ పార్టీ మొత్తాన్ని ఒక్క సారి రీయాక్టివేట్ చేస్తారని బీఆర్ఎస్ వర్గాలు భావిస్తున్నాయి. గోదావరి జలాల పేరుతో బహిరంగసభలతో దీన్నిప్రారంభించాలనుకున్నా.. మున్సిపల్ ఎన్నికల కారణంగా వాయిదా వేశారు.

# విజయం వెనుక రహస్యం...

కరీంనగర్, ఫిబ్రవరి 26,

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ విజయ పరంపర వెనుక ఒక బలమైన దైవ రహస్యం ఉంది. కరీంనగర్ కంచుకోటలో మహాశక్తి కొలువు తీర్చినా, భాగ్యనగర నడిబొడ్డున భాగ్యలక్ష్మి అమ్మవారి చెంత మోకరిల్లినా.. ఆయన వేసే ప్రతి అడుగు ఒక గెలుపు పిలుపుగా మారుతోంది. కార్పొరేటర్ స్థాయి నుండి నేడు కేంద్ర రాజకీయాల్లో చక్రం తిప్పే స్థాయి వరకు ఎదిగిన సంజయ్ ప్రస్థానంలో, 'భాగ్యలక్ష్మి అమ్మవారే' తన విజయలక్ష్మి అని ఆయన ప్రగాఢ నమ్మకం. వరుస విజయాలతో దూసుకుపోతున్న ఈ 'హిందూ హృదయ సామ్రాట్' సెంటిమెంట్ వెనుక ఉన్న ఆసక్తికరమైన ఆధ్యాత్మిక ప్రయాణంపై ప్రత్యేక కథనం..బండి సంజయ్ రాజకీయ ప్రయాణం కార్పొరేటర్ స్థాయి నుండి కేంద్ర మంత్రి వరకు ఎదిగింది అంటే, దానికి ఆయన పోరాట పటిమతో పాటు అమ్మవారిపై ఆయనకున్న అచంచలమైన విశ్వాసం కూడా ఒక కారణం.కార్పొరేటర్‌గా ఉన్న కాలంలోనే కరీంనగర్‌లో మహాశక్తి ఆలయ నిర్మాణానికి సంకల్పించడం ఆయన ఆధ్యాత్మిక చింతనకు నిదర్శనం. ఎంపీగా బాధ్యతలు చేపట్టాక ఆ సంకల్పాన్ని పూర్తి చేసి, ప్రతి ఏటా శక్తి మాల ధరించి అమ్మవారి సేవలో తరించడం ఆయనకు ఒక ఆనవాయితీగా మారింది. హైదరాబాద్‌లోని చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారు బండి సంజయ్ పాలిట విజయలక్ష్మిగా నిలిచారు.ఎన్నికల ప్రచారం ప్రారంభించే ముందు అమ్మవారిని దర్శించుకోవడం. కీలకమైన రాజకీయ నిర్ణయాలు లేదా పోరాటాల సమయంలో ఉదాహరణకు జీహెచ్ఎంసీ ఎన్నికలు, ప్రజా సంగ్రామ యాత్ర భాగ్యలక్ష్మి ఆలయం నుండే అడుగులు వేశాడు. వరుస విజయాలు రెండు సార్లు ఎంపీగా, జీహెచ్ఎంసీలో పార్టీ బలోపేతం ఈ నమ్మకాన్ని మరింత బలపరిచాయి.తెలంగాణలో బీజేపీ అధికారం చేపడితే భాగ్యలక్ష్మి ఆలయాన్ని స్వర్ణ దేవాలయంగా తీర్చిదిద్దుతామన్న ఆయన ప్రకటన




కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా ఈ ఆలయ అభివృద్ధిని ఆయన ఒక ప్రతిష్టాత్మక అంశంగా భావిస్తున్నారు.ఇటీవల కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ సాధించిన విజయం ఆయన నాయకత్వానికి మరో నిదర్శనం. గెలుపు అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్ మరియు కౌన్సిలర్లతో కలిసి భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకోవడం ద్వారా, తన విజయాలన్నీ అమ్మవారికే అంకితమని ఆయన మరోసారి చాటిచెప్పారు.రాజకీయాల్లో వ్యూహాలు ఎంత ముఖ్యమో, దైవబలం కూడా అంతే అవసరమని నమ్మే నాయకుల్లో బండి సంజయ్ ముందు వరుసలో ఉంటారు. భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో ఆయన మరిన్ని విజయాలు అందుకోవాలని ఆశిద్దాం.

==========================

# రాజ్యసభ ఎన్నిక ఏకగ్రీవమా...

హైదరాబాద్, ఫిబ్రవరి 26,

తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ఇప్పుడు రాజ్యసభ ఎన్నికల చుట్టూ తిరుగుతోంది. రాష్ట్రం నుంచి ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల కోసం జరగబోయే ఈ ఎన్నికలు ఏకగ్రీవం అవుతాయా లేక పోటీ తప్పదా అన్న ఉత్కంఠను రేపుతున్నాయి. అసెంబ్లీలో ప్రస్తుతమున్న ఎమ్మెల్యేల సంఖ్యను బట్టి చూస్తే, అధికార కాంగ్రెస్ పార్టీకి ఒక స్థానాన్ని సునాయాసంగా గెలుచుకునే సంఖ్యాబలం ఉంది. అయితే, రెండో స్థానాన్ని దక్కించుకోవాలంటే మాత్రం సమీకరణాలు కీలకంగా మారాయి. ఇక్కడే రాజకీయ చదరంగం మొదలవుతోంది.కాంగ్రెస్ పార్టీ ఒక స్థానానికి ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ పేరును దాదాపు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. గతంలో ఆయనకు తక్కువ కాలమే అవకాశం రావడంతో, ఈసారి ఆయనకే ప్రాధాన్యం ఇవ్వాలని అధిష్ఠానం నిర్ణయించినట్లు సమాచారం.అయితే, రెండో స్థానం విషయంలో మాత్రం పార్టీలో ఆశావహుల జాబితా చాంతాడంత ఉంది. సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి పేరు ఈ రేసులో బలంగా వినిపిస్తోంది. గత రెండేళ్లుగా అటు ప్రభుత్వంలోనూ, ఇటు పార్టీలోనూ కీలక పాత్ర పోషిస్తూ.. పలు ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఆయన క్రియాశీలకంగా వ్యవహరించారు.వీరితో పాటు వి.హనుమంతరావు, మధుయాస్కీ గౌడ్, టి.జీవన్ రెడ్డి, షబ్బీర్ అలీ, జగ్గారెడ్డి, జానారెడ్డి వంటి సీనియర్లు కూడా ఈ పదవిపై ఆశలు పెట్టుకున్నారు.మరోవైపు, ప్రతిపక్ష బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో ఎటువంటి వ్యూహాన్ని



అనుసరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. సంఖ్యాబలం తక్కువగా ఉన్నప్పటికీ, ఒక మైనార్టీ అభ్యర్థిని బరిలోకి దించడం ద్వారా కాంగ్రెస్‌ను ఇరకాటంలో పెట్టాలని బీఆర్ఎస్ యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే జరిగితే ఎంఐఎం మద్దతు ఎవరికి దక్కుతుందనేది ఉత్కంఠ రేపుతోంది. ఎంఐఎం మద్దతు గనుక కాంగ్రెస్‌కు లభిస్తే రెండో సీటును కూడా వారు సులువుగా గెలుచుకోవచ్చు. అయితే, బీఆర్ఎస్ మైనార్టీ కార్డును ప్రయోగిస్తే మాత్రం కాంగ్రెస్ తన అభ్యర్థి ఎంపికలో ఆచితూచి అడుగు వేయాల్సి ఉంటుంది. సామాజిక సమీకరణాలు దెబ్బతినకుండా చూసుకోవడం అధికార పార్టీకి పెద్ద సవాలుగా మారనుంది.బీజేపీకి ఉన్న 8 మంది ఎమ్మెల్యేలు ప్రస్తుత పరిస్థితుల్లో ఏ పార్టీకి మద్దతు ఇచ్చే అవకాశం లేదు. వారు తటస్థంగా ఉంటే అది పరోక్షంగా ఎవరికి లాభిస్తుందనే లెక్కలు కూడా మొదలయ్యాయి. ఈ నెల 26న నోటిఫికేషన్ విడుదల కానుండగా, మార్చి 5వ తేదీ వరకు నామినేషన్ల దాఖలుకు గడువు ఉంది. ఈ తక్కువ సమయంలో రాజకీయ పార్టీల మధ్య జరిగే అంతర్గత చర్చలు, పొత్తులు ఈ ఎన్నికల తుది ఫలితాన్ని నిర్ణయించనున్నాయి. ఒకవేళ బీఆర్ఎస్ వెనక్కి తగ్గితే ఎన్నికలు ఏకగ్రీవం కావచ్చు, లేనిపక్షంలో తెలంగాణలో మరో రాజకీయ రణరంగాన్ని చూడాల్సి వస్తుంది. మొత్తానికి ఈ రాజ్యసభ ఎన్నికలు రాబోయే రాజకీయ పరిణామాలకు ఒక కీలక మలుపుగా మారనున్నాయి.

# ఉద్యమ లక్ష్యాలనే నమ్ముకున్న గులాబీదళం.

హైదరాబాద్, ఫిబ్రవరి 26,

తెలంగాణ ఏర్పాటు తర్వాత రాజకీయ పార్టీగా మారామని కేసీఆర్ ప్రకటించారు. కానీ ఇప్పటికీ ఉద్యమపార్టీగానే వ్యవహరిస్తోంది. లక్ష్యం నెరవేరిన తర్వాత కూడా..తెలంగాణ సెంటిమెంట్తోనే రాజకీయాలు ఈదాలనుకుంటున్నారు. అక్కడే అసలైనతప్పిదం జరుగుతోంది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పుట్టిన టీఆర్ఎస్, లక్ష్యం నెరవేరిన తర్వాత రాజకీయ పార్టీగా




అవతరించింది. అయితే, కేసీఆర్ ప్రకటించినట్లుగా అది పూర్తిస్థాయి రాజకీయ శక్తిగా రూపాంతరం చెందిందా అంటే సందేహమే. పదేళ్ల అధికారం, రెండేళ్ల ప్రతిపక్షంగా బాధ్యతల తరవాత కూడా ఇప్పటికీ అదే తెలంగాణ సెంటిమెంట్ ను నమ్ముకుని రాజకీయం చేయడం ఆ పార్టీ చేస్తున్న అతిపెద్ద పొరపాటుగా మారుతోంది. ఉద్యమ కాలం నాటి వ్యూహాలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పని చేయడంలేదు.ఒక రాజకీయ పార్టీగా ప్రజల్లో గుర్తింపు పొందాలంటే ప్రభుత్వ వైఫల్యాలపై నిరంతరం పోరాడాలి. ప్రజల సమస్యలను భుజాన వేసుకోవాలి. కానీ బీఆర్ఎస్ మాత్రం ఇంకా ఉద్యమ కాలం నాటి భావోద్వేగాలనే పెట్టుబడిగా పెడుతోంది. తెలంగాణ ఏర్పాటు అనే ప్రధాన లక్ష్యం నెరవేరిన తర్వాత, ప్రజలు అభివృద్ధిని, సుపరిపాలనను కోరుకుంటారు తప్ప మళ్ళీ పాత సెంటిమెంట్లను కాదు. ఈ మార్పును గమనించడంలో ఆ పార్టీ నాయకత్వం వెనుకబడిందనే చర్చ సాగుతోంది.ఉద్యమ పార్టీగా ఉన్నప్పుడు ప్రజల్లో ఉండే ఆవేశం, రాజకీయ పార్టీగా మారినప్పుడు ఉండదు. కేవలం సెంటిమెంట్ చూపిస్తూ ఓట్లు అడగాలనుకోవడం ఇప్పుడున్న పరిస్థితుల్లో సాధ్యం కాదు. రాష్ట్రం వచ్చిన తర్వాత కూడా అదే పాత పాట పాడటం వల్ల ప్రజల్లో ఆ పార్టీ పట్ల ఉన్న ఆసక్తి తగ్గుతోంది. మా అవసరం ఉంది అని ప్రజలకు నమ్మకం కలిగించాలంటే, క్షేత్రస్థాయిలో ప్రజల పక్షాన నిలబడి పోరాడాలి. కానీ బీఆర్ఎస్ ఇంకా పాత జ్ఞాపకాల నుంచే రాజకీయం చేయాలనుకుంటోంది.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక రాజకీయ పార్టీగా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి. కానీ బీఆర్ఎస్ మాత్రం తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి పదే పదే ప్రాంతీయ వాదాన్ని తెరపైకి తెస్తోంది. ప్రజలు ఒక ప్రత్యామ్నాయ శక్తిగా గుర్తించాలంటే, ఆ పార్టీ తన పంథాను మార్చుకోవాలి. ఉద్యమ ముసుగును పక్కన పెట్టి, పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా జనం మధ్యకు వెళ్లాలి. సమస్యల పరిష్కారం కోసం గొంతు ఎత్తాలి తప్ప, గతాన్ని గుర్తు చేస్తూ కాలం గడపకూడదు.బీఆర్ఎస్ అగ్ర నాయకత్వం అనుసరిస్తున్న వ్యూహాలు ఇప్పుడున్న రాజకీయ పరిస్థితులకు ఏమాత్రం సరిపోవడం లేదు. సెంటిమెంట్ అనేది ఒక పరిమితి వరకే పనిచేస్తుంది. ఆ గీత దాటిన తర్వాత ప్రజలు వాస్తవాలను చూస్తారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో వెనుకబడి, కేవలం భావోద్వేగాలను నమ్ముకోవడం వల్ల పార్టీ కేడర్ కూడా గందరగోళానికి గురవుతోంది. రాజకీయ పార్టీగా తన బాధ్యతలను విస్మరించి, ఇంకా ఉద్యమ పార్టీగానే ఉండిపోవాలనుకోవడం ఆత్మహత్యాసదృశ్యమే అవుతుందన్న భావన ఎక్కువగా వినిపిస్తోంది.

# విస్తరణ తలనొప్పికి దూరమే..

హైదరాబాద్, ఫిబ్రవరి 26,

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో పాలన సాగిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత పార్టీ అధిష్ఠానం వద్ద ఆయన పరపతి గతంతో పోలిస్తే గణనీయంగా పెరిగింది. వరుస విజయాలు తెలంగాణ కాంగ్రెస్‌లో రేవంత్ రెడ్డి మాటకు తిరుగులేని పరిస్థితి కనిపిస్తోంది.మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న స్థానాలతో పాటు పని చేయని వారిని తీసేసి కొత్త వారితో భర్తీ చేయాలన్న చర్చ కొంత కాలంగా జరుగుతోంది. అయితే ఇప్పుడున్న మంత్రులను కదిలించడం , కొత్తవారిని తీసుకోవడం వల్ల పార్టీలో అంతర్గత విభేదాలు తలెత్తే ప్రమాదం ఉందని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న టీమ్ తోనే సమన్వయం చేసుకుంటూ వెళ్లడం మేలని ఆయన ఆలోచనగా తెలుస్తోంది. అనవసరంగా కేబినెట్ ప్రక్షాళన చేసి అసంతృప్తికి తావివ్వడం కంటే పాలనపై దృష్టి పెట్టడమే ఉత్తమమని ముఖ్యమంత్రి భావిస్తున్నట్లు సమాచారం. కానీ ఆయనపై ఒత్తిడి పెరుగుతోంది. ఆశావహులు పలువురు తమ ప్రయత్నాలను ఢిల్లీ స్థాయి నుంచి చేసుకుంటున్నారు. మంత్రివర్గ విస్తరణ చేపడితే సామాజిక వర్గాల వారీగా సమతుల్యత పాటించడం రేవంత్ రెడ్డికి పెద్ద సవాలుగా మారనుంది. రెడ్డి సామాజిక వర్గంతో పాటు బీసీ, ఎస్సీ , మైనారిటీ వర్గాలకు సరైన ప్రాతినిధ్యం కల్పించాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆశావహుల జాబితా చాంతడంత ఉండటంతో ఎవరిని తీసుకున్నా మిగిలిన వారిలో అసహనం కలిగే అవకాశం ఉంది. ఈ కారణాల వల్ల రేవంత్ రెడ్డి ప్రస్తుతానికి ఎలాంటి రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడటం లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ పై హైకమాండ్ నుండి రేవంత్ రెడ్డికి పూర్తి స్వేచ్ఛ లభించినట్లు సమాచారం. ఎవరిని మంత్రిగా తీసుకోవాలి, ఎవరిని తొలగించాలి అనే నిర్ణయాధికారం ఆయనకే వదిలేసినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ రేవంత్ రెడ్డి తక్షణమే ఈ ప్రక్రియను చేపట్టేందుకు ఆసక్తి చూపడం లేదని ..కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లాంటి వాళ్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.బడ్జెట్ సమావేశాలు, గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు వంటి కీలక రాజకీయ పరిణామాల తర్వాతే దీనిపై ఒక నిర్ణయం ఉండవచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అప్పటి వరకు ప్రస్తుత మంత్రుల పనితీరును గమనించి ఆ తర్వాతే మార్పులు చేసే అవకాశం ఉంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో రేవంత్ రెడ్డి తన పట్టును మరింత పెంచుకోవడం పైనే దృష్టి సారించారు. ఆశావహుల్ని ఎలా ఎదురు చూస్తూ ఉండేలా చేయనున్నారు.

# మొదటి ఘాట్ రోడ్డులో ప్రమాదం ఒకరు మృతి

తిరుమలతిరుమల మొదటి ఘాట్ రోడ్డులో రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక ద్విచక్రవాహనం అదుపు తప్పి పిట్టగోడను ఢీకొంది. ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయాపడిన వ్యక్తిని స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. 30వ మలుపులో తమిళనాడుకు చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్ వెళుతుండగా ప్రమాదం జరిగింది. మురళి స్విమ్స్ అత్యవసర వార్డులో గాయపడి చికిత్స పొందుతున్నాడు. నటరాజన్ మృతి చెందాడు.

# ముగ్గురు మంత్రులున్నా... మెడికల్ మాఫియా..

ఖమ్మం, ఫిబ్రవరి 26

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గ్రానైట్ ఫ్యాక్టరీలు, హోటళ్లు, సినిమాలు, ప్రైవేటు కంపెనీలు, దుకాణాలు, ఇతర ఫ్యాక్టరీలు, ఇలా ఎన్నో ఉన్నాయి. ఇందులో ఎంతలేదన్నా.. కనీసం 2.5 లక్షల మంది వరకు చిరు ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తూంటారు. వీరందరూ ఎంప్లాయీస్ స్టేట్ ఇన్స్యూరెన్స్ (ఈఎస్ఐ) కిందకే వస్తారు. ఉద్యోగులు, కార్మికుల కుటుం బసభ్యులతో కలిపితే సుమారు 10 లక్షల మందికి వైద్య సేవలు అందించాల్సిన ఈఎస్ఐ ఎందుకనో ఈ జిల్లాలో సరైన సేవలు అందించలేకపోతుంది. కేవలం ఒక్కటంటే ఒక్కటే డిస్పెన్సరీ (భద్రాచలం దగ్గర సారపాక)తో జిల్లా మొత్తానికి సేవలు అందుతున్నాయా అంటే పెదవి విరుపే సమాధానంగా కనపడుతోంది. పేరు గొప్ప.. ఊరు దిబ్బలా తయారయ్యింది ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిస్థితి. డిప్యూటీ సీఎంతోపాటు మొత్తం ముగ్గురు ముఖ్యమైన మంత్రులు ఉన్నప్పటికీ.. ఈఎస్ఐ సేవలు అందించడంలో మాత్రం అన్ని జిల్లాల కంటే వెనుకబడే ఉంటోంది. సుమారు 10 లక్షల మంది చిరుద్యోగు లకు, కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు సేవలు అం దించాల్సిన ఈఎస్ఐ డిస్పెన్సరీల ఏర్పాటు విషయంలో ముగ్గురు మంత్రులు ఏ మాత్రం దృష్టి సారించనట్టుగా కనపడటం లేదు. ఇందుకు ప్రధాన కారణం.. ఇక్కడ ఉన్న కార్మిక, చిరుద్యోగులు భారీగా ఉండటాన్ని పరిగణలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం (కార్మిక శాఖ) అదనంగా ఈఎస్ఐ డిస్పెన్సరీలను మంజూరు చేసినా.. వాటిని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేయడం లేదు. దీనితో చాలాకాలం వేచిచూసీ.. మంజూరు చేసిన డిస్పెన్సరీలను సైతం కేంద్రం రద్దు చేసింది. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం ఉన్న ముగ్గురు మంత్రులపై కార్మికులు, చిరుద్యోగులు భగ్గుమంటున్నారు.

ఖమ్మం జిల్లాలో ఉన్న కార్మిక లోకాన్ని, చిరుద్యోగులను దృష్టిలో పెట్టుకుని కేంద్రం సుమారు దశాబ్దం క్రితం (2018కి ముందు) మూడు ఈఎస్ఐ డిస్పెన్సరీలను మంజూరు చేసింది. అయితే అప్పటి ప్రభుత్వాలు దీనిపై దృష్టి పెట్టకపోవడంతో ఆ మూడింటినీ కేంద్రం రద్దు చేసింది. 2018లో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 15 డిస్పెన్సరీల ఏర్పాటులో భాగంగా.. ముదిగొండలోనూ ఈఎస్ఐ డిస్పెన్సరీని కేంద్రం మంజూరు చేసింది. అయితే షరా మామూలుగా.. ఈ 15 డిస్పెన్సరీల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. స్థల సేకరణ, భవన నిర్మాణం, సిబ్బందిని నియామకం లాంటివి చేయకపోవడంతో.. ఈ డిస్పెన్సరీల ఏర్పాటు అటకెక్కింది. దీనిపై అనేకసార్లు రాష్ట్ర ప్రభుత్వానికి తాఖీదులు పంపించిన కేంద్రం..ఈ ఏడాది జనవరిలో సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చింది. 15 రోజుల్లో డిస్పెన్సరీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలంటూ అల్టిమేటం ఇచ్చింది. అయినా.. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిలో మార్పు రాలేదు. దీనితో 2018లో మంజూరుచేసిన 15 డిస్పెన్సరీలను రద్దుచేస్తూ కేంద్రం ఆదేశాలు జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 15 డిస్పెన్సరీలను రద్దయ్యాయి. వాటిటో.. ఖమ్మం జిల్లాలోని ముదిగొండలోని డిస్పెన్సరీకూడా ఉండటంతో ఖమ్మంలోని కార్మికవర్గాలు మండిపడుతున్నాయి. హైదరాబాద్ నగరం తరువాత అత్యధిక మంది కార్మికులు, చిరుద్యోగులు ఉన్న పట్టణాల్లో ఖమ్మం కూడా ఉంది. ఈ నేపథ్యంలో గతంలోనే మూడు మంజూరైనా అప్పటి ప్రభుత్వాలు ఏర్పాటు చేయకపోవడం..తాజాగా ముదిగొండలోనూ ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటుపై జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులకే ఆసక్తి లేకపోవడాన్ని ఇక్కడ కార్మిక వర్గాలు ఎత్తిచూపుతున్నాయి. స్థల సేకరణ, భవన నిర్మాణం, ఉద్యోగులను కేటయిస్తే.. వేలాదిమంది కార్మికులు.. వారి కుటుంబ సభ్యులతో కలుపుకుంటే.. లక్షలాది మందికి విస్తృతమైన సేవలు అందించే సదుపాయాన్ని మంత్రులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఎప్పుడో సారపాకలో ఏర్పాటుచేసిన ఒక డిస్పెన్సరీ ఉంది. అలాగే గతంలో కేంద్రం తీసుకున్న నిర్ణయం మేరకు బ్రాంచ్ ఆఫీసుగా పిలుచుకునే లోకల్ ఆఫీసు (ఖమ్మంలోని రాపర్తినగర్) మాత్రమే ఈఎస్ఐ పరిధిలో ఉన్నాయి. ఇందులోనూ డిస్పెన్సరీలో మాత్రమే వైద్యులు, సిబ్బంది, మందులు ఉంటాయి. ఇక లోకల్ ఆఫీసు (బ్రాంచ్ ఆఫీసు)లో ఎలాంటి వైద్య సేవలు అందవు.. మందులు అందుబాటులో ఉండవు. కొండొకచో.. వైద్యుడు వచ్చి చూసి వెళుతుంటారు. అంతకుమించి అక్కడ అందే వైద్య సేవలు ప్రత్యేకంగా ఏమీ ఉండవు. ఈ నేపథ్యంలోనే ఖమ్మం లాంటి చోట భారీగా ఉన్న కార్మికులు, చిరుద్యోగులను దృష్టిలో పెట్టుకుని కేంద్రం డిస్పెన్సరీలను మంజూరు చేసినా, రాష్ట్ర ప్రభుత్వం వైఖరితో అవికూడా రద్దు కావడంతో.. జిల్లా నాయకత్వంపై సర్వత్రా తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. డిస్పెన్సరీ ఏర్పాటు అనేది చిన్న అంశంగా బయటకు కనపడుతుందని, ఒకవేళ డిస్పెన్సరీని ఏర్పాటుచేస్తే.. ఖమ్మం జిల్లాలోని వేలాది మంది కార్మికులు, చిరుద్యోగులు, వారి కుటుంబాలతో కలిపి సుమారు 10 లక్షల మంది వరకు ప్రైవేటు ఆసుపత్రులకు దూరం అవుతారు. ఈఎస్ఐ డిస్పెన్సరీల్లో ఒక్క పైసా లేకుండా చికిత్సలు అందిస్తారు. ఒకవేళ వ్యాధి తీవ్రతను బట్టి.. హైదరాబాద్‌లోని ఈఎస్ఐ వైద్య కళాశాలకు, ఆసుపత్రికి రిఫర్ చేస్తారు. దీనివల్ల ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే రోగులు తగ్గిపోయి.. రూ. కోట్లు నష్టపోతామనే ఉద్దేశంతోనే మెడికల్ మాఫియా చాపకింద నీరులా ప్రభుత్వ పెద్దలను ప్రభావితం చేసి డిస్పెన్సరీని ఏర్పాటు చేయకుండా అడ్డుకుందని గట్టిగా అనుమానిస్తున్నారు. అయితే కార్మికులు, చిరుద్యోగుల దృష్టిలో.. ప్రస్తుతం ఏచిన్న వైద్య సేవలు అందాలన్నా.. ప్రైవేటు ఆసుపత్రులనే ఆశ్రయించాల్సి వస్తోంది. దీనికి రూ. వేలల్లో ఖర్చువుతోంది. అదే ఈఎస్ఐ డిస్పెన్సరీలను ఏర్పాటుచేస్తే.. పూర్తి ఉచితంగానే వైద్యసేవలు, మందులు, డ్రగ్స్ అందుతాయని వారంటున్నారు. ఈఎస్ఐ డిస్పెన్సరీల ద్వారా ఉచితంగా వచ్చే వైద్యసేవలు అందకుండా అడ్డుకున్న మెడికల్ మాఫియాపై, అచేతనంగా ఉన్న ముగ్గురు మంత్రులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. కార్మికులు, చిరుద్యోగులు భారీ సంఖ్యలో ఉండటంతో.. ఖమ్మం పట్టణంలో ప్రతి గ ల్లీకి ఒక ప్రైవేటు ఆసుపత్రి కనిపిస్తుంది. అలాగే జిల్లా వ్యాప్తంగాకూడా భారీగా ప్రైవేటు ఆసుపత్రులు ఎప్పుడూ రోగులతో కిటకిటలాడుతూ కనపడుతుంటాయి. వాస్తవానికి ఇక్కడికి వచ్చేవారిలో 50 శాతం కంటే ఎక్కువ మంది రోగులు కార్మికులు, చిరుద్యోగులు, చిరువ్యాపారులు, వారి కుటుంబ సభ్యులే ఉంటారు. అంటే వీరందరూ ఈఎస్ఐ పరిధిలోకి వస్తారన్నమాట. తాజాగా ముదిగొండలో మంజూరుచేసిన డిస్పెన్సరీని కూడా రద్దు చేయడంతో.. ఈ ప్రభావం కార్మికులపైనే ఎక్కువగా పడుతుందని వారంటున్నారు. అయితే మంజూరైన డిస్పెన్సరీలను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ఏర్పాటు చేయలేకపోతుందనే అనుమానాలు వీరిని తొలుస్తున్నాయి. పరిస్థితి చూస్తే.. ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు అయితే.. ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా తగ్గి..ప్రైవేటు ఆసుపత్రుల వ్యాపారం దెబ్బతింటుందని, ఈ నేపథ్యంలోనే మెడికల్ మాఫియా ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి తెచ్చి.. డిస్పెన్సరీల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం విముఖత చూపించి ఉంటుందని కార్మిక వర్గాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. అందుకే ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ.. మంజూరైన డిస్పెన్సరీ ఏర్పాటుపై దృష్టి పెట్టలేదంటూ వాపోతున్నారు.

# భారీ విస్తరణ దిశగా ఓయో

హైదరాబాద్, ఫిబ్రవరి 26,

ఓయో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో తన వ్యాపార విస్తరణను మరింత వేగవంతం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మొత్తం 300 కంపెనీ సర్వీస్డ్ హోటళ్లను ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించింది. ముఖ్యంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం నగరాలను ప్రధాన లక్ష్యంగా ఎంపిక చేసింది. హైదరాబాద్‌లో నిర్వహించిన హోటల్ భాగస్వాముల సదస్సులో ఈ కీలక ప్రకటన వెలువడింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణ కేంద్రాలు, టియర్-2 నగరాల్లో తమ బలమైన ఉనికిని ఏర్పరచుకోవడమే ఈ కార్యక్రమం లక్ష్యంగా సంస్థ వెల్లడించింది. హైదరాబాద్‌లో అభివృద్ధి చెందుతున్న మెడికల్, బిజినెస్ టూరిజం రంగాల వల్ల ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. అదే సమయంలో ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతాలైన యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం, భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం ప్రాంతాలకు వచ్చే భక్తుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోంది. ఈ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని సంస్థ తన విస్తరణ వ్యూహాన్ని రూపొందించింది. ఇక ఏపీలో వైజాగ్ సహా విజయవాడ, తిరుపతి వంటి నగరాల్లో ప్రీమియం హోటల్స్ సంఖ్యను పెంచేందుకు వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం. సరఫరా పెంపు, హోటళ్ల నాణ్యత ప్రమాణాల మెరుగుదల, అతిథులకు మెరుగైన సేవల అందుబాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన అభివృద్ధి ప్రణాళికను సంస్థ ప్రకటించింది. మౌలిక సదుపాయాల అభివృద్ధి, పెరుగుతున్న ఆర్థిక కార్యకలాపాలు, మెరుగైన విమాన సౌకర్యాలు వంటి కారణాల వల్ల తెలంగాణ దేశంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న హాస్పిటాలిటీ మార్కెట్‌గా మారుతోంది. ఈ సందర్భంగా ాజూ మాతృసంస్థగా పేర్కొన్న సంస్థ) రీజినల్ హెడ్ (సౌత్ సెంట్రల్,ఈస్ట్) అయిన ఆశిష్ సౌరభ్ మాట్లాడుతూ, తెలంగాణ హాస్పిటాలిటీ రంగం నిర్మాణాత్మకంగా బలంగా ఉందన్నారు. హైదరాబాద్ వంటి వ్యాపార కేంద్రాలు స్థిరమైన కార్పొరేట్ డిమాండ్‌ను అందిస్తుండగా, మెరుగైన కనెక్టివిటీ కొత్త లీజర్ టూరిజం అవకాశాలను తెరుస్తోందని తెలిపారు. అతిథులకు మరింత విశ్వసనీయమైన సేవలను అందించే బలమైన నెట్‌వర్క్‌ను నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ సమగ్ర వ్యూహం భాగస్వాములకు దీర్ఘకాలిక లాభాలను అందించడమే కాకుండా, ప్రయాణికులకు స్థిరమైన నాణ్యతతో కూడిన సేవలను అందించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. దేశీయ పర్యాటకం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణలో హోటల్ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు

# బాలీవుడ్ వర్సెస్ టాలీవుడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 26

సినిమా ఇండస్ట్రీలో సక్సెస్ లను సాధించిన హీరోకి క్రేజ్ భారీ రేంజ్ లో మార్కెట్ ఉంటుంది. వాళ్ల నుంచి వచ్చిన సినిమాలను ప్రేక్షకులు అలరించడమే కాకుండా వాళ్ళు కనిపిస్తే చాలు వాళ్ళతో ఫోటోలు దిగడానికి కూడా ఎగబడిపోతుంటారు. ఇక ఇలాంటి క్రమంలోనే మన హీరోలు గత 10 సంవత్సరాల క్రితం వరకు తెలుగు సినిమాలకే పరిమితమయ్యారు. కానీ ఎప్పుడైతే బాహుబలి సినిమా వచ్చిందో అప్పటినుంచి పాన్ ఇండియా స్థాయిలో మన హీరోలు సినిమాలను చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు? ఇక ఇప్పటివరకు మన హీరోలు టాప్ లో ఉండాలనే ఆలోచిస్తున్నారు. కానీ బాలీవుడ్ హీరో అయిన రణ్వీర్ సింగ్ దూరంధర్ సినిమాతో సైతం 1000 కోట్ల మార్కెట్ ను దాటేశాడు. కాబట్టి బాలీవుడ్ హీరోలు మరోసారి ఊపందుకునే ప్రయత్నంలో ఉన్నారు. అలాంటి సందర్భంలో వారిని తక్కువ అంచనా వేసి చూడకూడదు. మన ప్రయత్నంలో మనం ఉండాలి అలాగే వాళ్ళ కంటే బెటర్ సినిమాలను చేసి సూపర్ హిట్లను సాధించడానికి తీవ్రమైన కృషి చేయాలి. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించిన కూడా మళ్లీ మన హీరోలు బీట్ చేసి వాళ్ళ ముందుకు దూసుకెళ్లే ప్రమాదం కూడా ఉంది? కాబట్టి ప్రతి విషయంలో మన వాళ్ళు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తే మంచిదని మరి కొంతమంది సినిమా మేధావులు సైతం మన హీరోలను, దర్శకులను హెచ్చరిస్తున్నారు. ఇక ఇలాంటి క్రమంలోనే వీళ్ళు ఎలాంటి సక్సెస్ ను సాధిస్తారు. తద్వారా వీళ్ళకంటూ ఒక ఐడెంటిటి క్రియేట్ అవుతుందా? లేదా అనేది తెలియాలంటే మాత్రం మరికొద్ది రోజులు వెయిట్ చేయాల్సిందే? ఖాన్ త్రయం పని అయిపోయినప్పటికి నెక్స్ట్ జనరేషన్ బాలీవుడ్ హీరోలందరు కూడా మంచి కాన్సెప్ట్ లను ఎంచుకొని సినిమాలు చేస్తున్నారు. కాబట్టి మన హీరోలు సైతం చాలా చాకచక్యంగా వ్యవహరిస్తూ కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలను చేస్తూ తెలుగు ఇండస్ట్రీ స్థాయిని పెంచాల్సిన పరిస్థితి అయితే ఏర్పడింది? ఇక ఏది ఏమైనా కూడా ఇండియాలో ఇప్పుడున్న స్టార్ డైరెక్టర్లందరు మన హీరోల వైపే మొగ్గుచూపుతున్నారు. మన వాళ్ళతో సినిమాలను చేస్తే వాళ్లకు కూడా గొప్ప పేరు వస్తుందని ఆలోచిస్తున్నారు

===============

# పూర్తికాని వెలుగొండను.. జాతికి అంకితమంటూ జగన్ మోసగించారు

## గుండ్లకమ్మ గేట్లు విరగ్గొట్టి ఇసుక దోపిడీ చేశారు
## ఐదేళ్లలో అన్ని వ్యవస్థల్నీ జగన్ రెడ్డి భ్రష్టు పట్టించాడు
## కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నాం
## -ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

మార్కాపురం: పూర్తికాని వెలుగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేశామంటూ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రకాశం జిల్లా ప్రజలను మోసగించారని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆరోపించారు. పనులు పూర్తిచేయకుండా కేవలం ప్రచారానికే పరిమితం అయ్యారని దుయ్యబట్టారు. రైతుల ఆశలను వమ్ము చేస్తూ ప్రాజెక్టును రాజకీయ లాభాల కోసం ఉపయోగించుకున్నారని విమర్శించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు ధ్వంసం చేసి, భారీ ఎత్తున ఇసుక దోపిడీ చేశారని అన్నారు. ప్రజా సంపదను కాపాడాల్సిన ప్రభుత్వం దానినే దోచుకుందన్నది దురదృష్టకరమన్నారు. ఇలా జగన్ రెడ్డి అధికారంలో ఉన్న ఐదేళ్లలో అన్ని వ్యవస్థలను జగన్ రెడ్డి భ్రష్టు పట్టించారని పేర్కొన్నారు. మార్కాపురం జిల్లాలో బుధవారం నాడు సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజా వేదిక బహిరంగ సభలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ... కూటమి ఏర్పడిన వెంటనే గుండ్లకమ్మకు కొత్త గేట్లను ఏర్పాటు చేయడంతో పాటు మత్స్యకారుల సంక్షేమం కోసం 20 లక్షల చేప పిల్లలను గుండ్లకమ్మలో వదిలిన విషయాన్ని మంత్రి సభా ముఖంగా గుర్తు చేశారు. వెలిగొండ ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు బడ్జెట్ లో నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టుల నిర్మాణాన్ని కూడా వేగవంతం చేసినట్లు స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. గడిచిన 19 నెలల కాలంలోనే ముఖ్యమంత్రి సహాయ నిధి కింద పేదలకు వెయ్యి కోట్లు రూపాయిలు సహాయం చేశామని తెలిపారు. జగన్మోహన్ రెడ్డికి పేదల పెన్షన్ వెయ్యి రూపాయిలు పెంచడానికే ఐదేళ్లు పట్టిందని ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంలో అన్ని హామీలను అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. కేవలం ఒక్క సంతకంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల పెన్షన్ ను వెయ్యి రూపాయిలు పెంచారని చెప్పారు. ఆర్థిక అసమానతలు తొలగించడానికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పీ4 కార్యక్రమాన్ని రూపొందించారని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.

# ఎమ్మెల్సీ సోము వీర్రాజు పై దాడికి వైకాపా ఎమ్మెల్సీల యత్నం

అమరావతిబీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజుపై దాడి చేయడానికి వైసీపీ ఎమ్మెల్యేలు ప్రయత్నించడం గురువారం శాసనమండలిలో హాట్ టాపిక్ గా మారింది. రేవంత్ రెడ్డి తెలంగాణ అసెంబ్లీలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ను ఆపించామని ప్రకటించారని..దానిపై ప్రభుత్వం ప్రకటన చేయాలని వైసీపీ ఎమ్మెల్సీలు ఆందోళన చేశారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై వచ్చిన ప్రశ్నలో భాగంగా ఈ చర్చ వచ్చింది. సభ్యులు మాట్లాడిన తర్వాత మంత్రి సమాధానం ఇచ్చారు . సమాధానం అయిపోయిన తర్వాత తదుపరి ప్రశ్నకు మండలి చైర్మన్ వెళ్లారు. అయితే రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సమాధానం చెప్పాలని వైసీపీ సభ్యులు పట్టుబట్టారు. ప్రశ్న కు సమాధానం పూర్తయినందున ఇక దానిపై చర్చ ఉండదని చెప్పిన మండలి చైర్మన్ తదుపరి ప్రశ్న అడిగేందుకు..సోము వీర్రాజుకు అవకాశం కల్పించారు.

# పేదలకు విద్య అందాలంటే ఊరి బడి ఉండాల్సిందే !

## -ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణే యుటిఎఫ్ లక్ష్యం

## .-యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్

బద్వేలు పేదలకు నాణ్యమైన ప్రభుత్వ విద్య అందాలంటే ఊరి బడి ఉండాల్సిందేనని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ పేర్కొన్నారు. కడప నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు డి.సుజాత రాణి అధ్యక్షతన జరిగిన "ప్రభుత్వ బడిలోనే విద్యార్థులను చేర్పిద్దాం-ఊరి బడిని కాపాడుకుందాం"అనే అంశంపై జరిగిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కె.ఎస్.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోన్ముఖాభివృద్ధికి పాటుపడుతూ, విద్యార్థులను అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాలలు నేడు పాలకుల విధానాల ఫలితంగా ప్రమాదపుటంచుల్లోకి నెట్టి వేయబడ్డాయని ఆరోపించారు. ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణే లక్ష్యంగా హామీలిస్తున్న పాలకవర్గాలు తీరా గద్దినెక్కాక హామీలను విస్మరిస్తూ ప్రభుత్వ విద్యారంగ నిర్వహణ బాధ్యతల నుండి క్రమేపి తప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. గతంలో వైసిపి ప్రభుత్వం 117 జీవోను ప్రవేశపెట్టి, పాఠశాలల విలీనం పేరుతో ప్రభుత్వ విద్యారంగాన్ని అస్తవ్యస్తంగా తయారు చేసిందన్నారు. అప్పటి ప్రతిపక్ష హోదాలో వైసీపీ ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా తప్పు పట్టిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం, తాము అధికారంలోకి రాగానే జీవో 117 ను రద్దుచేసి ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షిస్తామని హామీ ఇచ్చారన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత జీవో 117 స్థానంలో జీవో 20 ని అమలు చేశారే తప్ప విధానాల్లో మాత్రం మార్పు లేదన్నారు. పాలకవర్గాలు విద్యారంగ నిర్వహణ బాధ్యతల నుండి తప్పుకునేందుకు ఉద్దేశపూర్వకంగా ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తూ నిరంతరం బోధనేతర కార్యక్రమాలలో భాగస్వాములను చేస్తున్నారన్నారు. వివిధ యాప్ల పేరుతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందకుండా చేయడంలో పాలకవర్గాలు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు.

ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ లాంటి సంస్థల ఆదేశాల మేరకే ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేందుకు పాలకులు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. ఒకవైపు ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు విద్య అందకుండా చేస్తూ మరోవైపు ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లోకి తరలి వెళ్లేందుకు మార్గం సుగమం చేస్తున్నారన్నారు. సాల్ట్ పథకం అమలులో భాగంగా ప్రపంచ బ్యాంకు నుండి 1750 కోట్లు అప్పు తీసుకున్న ప్రభుత్వం వారితో చేసుకున్న ఒప్పందం మేరకు ప్రభుత్వ పాఠశాలలను, ఉపాధ్యాయులను కుదించేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. అందులో భాగంగానే సాక్షాత్తు విద్యాశాఖ కమిషనర్ రాష్ట్రంలోని ఉన్న 43 వేల పాఠశాలల నుండి 11 వేల పాఠశాలను కుదిస్తామని ప్రకటించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,70,000 ఉపాధ్యాయ పోస్టులను 1,10,000 పోస్టులకు కుదించేందుకు ఆలోచన చేస్తున్నారన్నారు. సంస్కరణల పేరుతో ప్రభుత్వ విద్యను నిర్వీర్య పరుస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్య అందకుండా చేసేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం నాడు-నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలలను ముస్తాబు చేసిందని, కానీ బోధనేతర కార్యక్రమాల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సైతం గత ప్రభుత్వ విధానాలనే అమలు చేస్తూ, మరోపక్క ప్రభుత్వ విద్యా రంగంపై కపట ప్రేమను ప్రదర్శిస్తున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో 17వేల ఏకోపాధ్యాయ పాఠశాలలు కొనసాగుతున్నాయని, 2020 నాటికి ప్రభుత్వ పాఠశాలలో 46 లక్షల మంది విద్యార్థులు కొనసాగుతుండగా 2025 నాటికి 31.50 లక్షల మందికి మంది మాత్రమే ఉన్నారని, ప్రస్తుతానికి ఆ సంఖ్య 29.30 లక్షల మందికి పడిపోయిందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన జరగకుండా కుట్రలు చేస్తూ, మరోపక్క ప్రభుత్వ పాఠశాలలో సంఖ్య తగ్గిపోవటానికి ఉపాధ్యాయులే కారకులని చిత్రీకరించేందుకు పాలకుల ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మి రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు లు మాట్లాడుతూ పాలకుల విధానాల ఫలితంగా సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోకపోతే, పేదలకు ప్రభుత్వ విద్య దూరమయ్యే ప్రమాదముందని పేర్కొన్నారు.



## చెరువును చెరబట్టి.. మట్టిని కొల్లగొట్టి

ఐనవోలు, జల వనరులను సంరక్షించుకోవాలని పర్యావరణ వేత్తలు, న్యాయస్థానాలు, అధికారులు చెబుతున్నారు. ఈ మాటలు అక్రమార్కులకు పట్టడం లేదు. వారి స్వార్థం తప్ప పర్యావరణం, ప్రజల గురించి వారికి అనవసరం అన్నట్లు వ్యవహరిస్తున్నారు. చెరువులు, కుంటల్లో మట్టిని కొల్లగొట్టి సొమ్ము చేసుకుంటున్నారు. ఐనవోలు మండలం పంథిని గ్రామ శివారులోని నాగుల చెరువులో 40 రోజులుగా సాగుతున్న దందానే దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు. ఇందిరమ్మ ఇళ్ల పేరు చెప్పి అక్రమార్కులు వ్యాపారాన్ని ఇష్టానుసారంగా తవ్వి తరలిస్తూ సొమ్ము చేసుకొంటున్నారు. రెండ్లు ప్రొక్లెయిన్లతో మట్టిని తవ్వుతూ రేయింబవళ్లు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. చెరువులో ఏర్పడిన భారీ గుంతలు వర్షాలకు నిండితే ప్రమాదమేనని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక అధికారుల సహకారంతో ఈ దందా కొనసాగుతున్నట్లు ఆరోపిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల అవసరానికి వారం రోజులు చెరువులో మట్టి తీసేందుకు పంచాయతీ అధికారులు రెండుసార్లు రెవెన్యూశాఖ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. అది నీటిపారుదలశాఖ పరిధిలో ఉండటంతో వారు అనుమతి ఇవ్వలేదు. అక్రమంగా చేస్తున్న తవ్వకాలను ఇరిగేషన్ అధికారులు అడ్డుకున్నా.. ఇతర అధికారుల ప్రోత్సాహంతో అక్రమార్కులు యథేచ్ఛగా మట్టితవ్వకాలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రోజుకు సుమారు 500 ట్రిప్పులకు పైగా మొరం తరలిపోతోంది. ఒక్కో ట్రాక్టర్ మట్టిని రూ.600 నుంచి రూ.750 వరకు విక్రయిస్తున్నారు. దీనిలో 15 శాతం స్థానిక అధికారులకు అందుతున్నట్లు మత్స్యకారులు, ఓ మాజీ ప్రజాప్రతినిధి ఆరోపిస్తున్నారు. ఈ విషయమై నీటిపారుదల శాఖ ఏఈ ప్రశాంత్‌ను వివరణ కోరగా.. పలుమార్లు తవ్వకాలను అడ్డుకున్నామని, మేము తిరిగి వచ్చాక యథావిధిగా మళ్లీ తవ్వకాలు చేస్తున్నారని చెప్పారు. పరిశీలించి మట్టి తవ్వకాలకు ఉపయోగిస్తున్న యంత్రాలపై కేసు నమోదు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.



## ముఖం చూపిస్తేనే.. పింఛను

భూపాలపల్లి ప్రతి నెలా బ్యాంకు, తపాలా శాఖ ఆధ్వర్యంలో వీటిని అందిస్తుంటారు. చాలా మందికి బ్యాంకు ఖాతాలు లేకపోవడంతో తపాలా శాఖ ద్వారా పింఛను పొందుతున్నారు. అయితే వృద్ధులు, దివ్యాంగులు ఆయా సొమ్ము పొందాలంటే తప్పనిసరిగా వేలిముద్రలు వేయాల్సిందే. చేతిరేఖలు సరిగా లేనటువంటి వృద్ధులు, దివ్యాంగులకు ప్రతి నెలా సమస్య ఎదురవుతోంది. దీంతో అధికారులు తమ వేలిముద్రల ద్వారా పింఛన్ మొత్తాన్ని తీసుకుని వారికి అందిస్తుంటారు. ఇలాంటి సందర్భంలోనే లబ్ధిదారులకు నగదు అందకుండా పక్కదారి పడుతోందనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 'ముఖ గుర్తింపు' విధానం అమలుకు శ్రీకారం చుట్టింది.

నూతన విధానం ఇలా..

ముఖ గుర్తింపు ద్వారా పింఛన్లు అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం టీజీ ఆన్‌లైన్ సంస్థ సహకారంతో చేపడుతోంది. తపాలా శాఖ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. ఇందుకుగాను నూతన యాప్‌ను రూపొందించారు. ఇప్పటికే పోస్టుమాస్టర్లు, పంచాయతీ కార్యదర్శులకు అవసరమైన శిక్షణ కూడా ఇచ్చారు. పింఛను పొందడానికి పోస్టల్ కార్యాలయానికి వెళ్లిన లబ్ధిదారుల ఫొటోను తీసుకుని ఆధార్‌లోని ఫొటోతో సరిపోల్చి నూతన యాప్‌లో నమోదు చేసి సొమ్ము మంజూరు చేస్తారు. పింఛన్ల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం ముఖ గుర్తింపు విధానాన్ని తీసుకువచ్చిందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బాలకృష్ణ తెలిపారు. దీనిద్వారా ఎలాంటి అవకతవకలు లేకుండా లబ్ధిదారులకు సక్రమంగా పింఛను అందుతుందని పేర్కొన్నారు.

## భక్తులు మురిసేలా.. వెలగాలి భద్రకాళి

రంగంపేట, తెలంగాణ ఇంద్రకిలాద్రిగా పేరొందిన భద్రకాళి దేవాలయం అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. రూ.32 కోట్లతో మాడవీధులు, రూ.20 కోట్లతో నాలుగు వైపులా రాజగోపురాల నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో కొంతకాలంగా ఆలయంలో పరిపాలన పూర్తిగా అదుపు తప్పింది. ఉద్యోగులు, అర్చకులు ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాల సహాయ కమిషనర్‌గా, గతంలో ఈవోగా పనిచేసిన అనుభవం కలిగిన రామల సునిత వీటిపై దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు. భక్తుల రద్దీకనుగుణంగా క్యూ లైన్లు లేవు. ఉన్న వాటిని సక్రమంగా వినియోగించడం లేదు.

వీఐపీల పేరుతో అడ్డగోలుగా దర్శనాలు చేయిస్తున్నారు. సాధారణ దర్శనాలు పూర్తిగా విస్మరించారు.

# నిరుపయోగంగా అద్దె గదులు!

యాదగిరిగుట్ట, ఆగసు2: : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్ర దర్శనానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివస్తుంటారు. వీరికోసం పాతఆచారాల పునరుద్ధరణ పేరుతో సదుపాయాలు కూడా ఒక్కొక్కటిగా కొండపైన సమకూరుతున్నాయి. కొండకింద పాతబస్టాండ్ ఎదురుగా భక్తుల ఇబ్బందులు తొలగించేందుకు వైటీడీఏ ఆధ్వర్యంలో నిర్మించిన అద్దె గదుల విషయంలో మాత్రం దేవస్థానం అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.



టెండరుదారుడు వేలం పాట అధికంగా నిర్వహించడంతో అద్దె చెల్లించలేక చేతులెత్తేశారు. దేవస్థానం అద్దె గదుల నిర్వహణ పట్టించుకోక నిరుపయోగంగా మారి భక్తులకు గదుల కొరత ఎదురవుతోంది. కొండకింద కుల సత్ర భవనాల అద్దె గదుల వ్యాపారానికి దేవస్థానం అధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

రహదారి వెంట అద్దె గదులు

బస్టాండ్ ఎదురుగా హైదరాబాద్ ప్రధానరహదారిపై నిర్మించిన ఆండాళ్ నిలయం భవనాలు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. గోడలకు మర్రి, రావి చెట్లు మొలుస్తున్నాయి. 24 అద్దె గదులు, కింది భాగంలో 56 దుకాణ సముదాయాలు, 4 హాళ్లు ఉన్నాయి. భక్తులు అందుబాటులో ఉండేలా మూడేళ్ల (2023 మార్చి 20 నుంచి 2026 మార్చి 19 వరకు) కాలపరిమితితో టెండరు నిర్వహించారు. కాలక్రమేణా అద్దె అధికమై నష్టాలు వస్తున్నాయంటూ టెండరుదారుడు ఈ ఏడాది మార్చి నెలలో ఏడాది ముందుగానే టెండరుదారుడు దేవస్థానానికి అప్పగించాడు. నాటి నుంచి నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి స్వామివారి దర్శనార్థం తరలివచ్చే భక్తులకు గదుల వసతి లేకుండాపోయింది.

జీఎస్టీతో రూ.42లక్షల వేలం

అద్దె గదులు సుమారు రూ.36లక్షల వేలం పాటలో టెండర్‌దారుడు దక్కించుకోగా రూ.6 లక్షల జీఎస్టీతో కలిపి రూ.42లక్షలు చెల్లించాల్సి వచ్చింది. సుమారు రెండేళ్ల పాటు టెండరుదారుడు గదులు నిర్వహణ బాధ్యత వహించి 2025 మార్చిలో దేవస్థానానికి అప్పగించారు. ఐదు నెలలు కావస్తున్నా గదుల తాళం తీసేందుకు అధికారులు చర్యలు చేపట్టడం లేదు.

పాతగుట్ట దేవస్థానం పరిధిలో కూడా 10 అద్దె గదులు నిరుపయోగంగా ఉన్నాయి. వీటిని అధికారుల దృష్టికి తీసుకుపోగా కొత్తగా ఫంక్షనహాల్ నిర్మించేందుకు యోచిస్తున్నామని సమాధానమిచ్చారు. సిబ్బంది కొరత అంటూ దాటవేస్తూ భక్తుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదు. పట్టణంలో పలు కులసంఘాల భవనాలు వెలిశాయి. పట్టణంలో అనువుగా దేవస్థానానికి చెందిన ఆండాళ్ నిలయం అద్దె గదులు అందుబాటులో ఉన్నప్పటికీ అలంకారప్రాయంగా మారాయి.

గదుల్లో సౌకర్యాల లేమి

రెండు భవనాల్లో కలిపి భక్తులకు అద్దెకు ఇచ్చేందుకు 24 గదులు ఉన్నాయి. ఏ ఒక్క గదిలో సౌకర్యాలు సరిగా లేవు. ఒక్కో గదిలో ఫ్యాన్లు, మరుగుదొడ్లు, తలుపులు, నల్లాలు, స్విచ బోర్డులు పూర్తిగా ధ్వంసమై ఒక్కో తీరుగా గదుల పరిస్థితి ఉంది. కాంప్లెక్స్ వెనకాల గోడలకు మొక్కలు మొలిచాయి. వీటి స్థానంలో అవసరం ఉన్నచోట మరమ్మతులు చేసి గదులు అందుబాటులోకి తెస్తే భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తాం

ఈ ఏడాది మార్చి నెల నుంచి రెండు పర్యాయాలు టెండర్లు ఆహ్వానించినా ఎవరూ ముందుకు రాలేదు. ప్రస్తుతం దేస్థానం ఆధ్వర్యంలోనే అద్దె గదుల నిర్వహణ చేసేందుకు బాధ్యత తీసుకుంటాం. క్షేత్ర దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా మరమ్మతులు చేయించి అద్దె గదులు అందుబాటులోకి తెస్తాం. పాతగుట్ట వద్ద అద్దె గదులు శిథిలావస్థలో ఉన్నాయి. వాటి స్థానంలో ఫంక్షన హాల్ నిర్మించాలని యోచిస్తున్నాం.

## ఆపద వస్తే అంతేనా?

-సూర్యాపేట ఎంతోమంది ప్రయాణ సమయంలో అనారోగ్యానికి గురవుతుంటారు. పలు సందర్భాల్లో డ్రైవర్లు, కండక్టర్లు అనారోగ్యానికి గురై మృత్యువాతపడుతున్నారు. ఎక్కువగా డ్రైవర్లు విధి నిర్వహణలో గుండెపోటుతో మృతి చెందుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. గుండెపోటు వచ్చినప్పుడు వారికి ప్రథమ చికిత్స అందజేస్తే కొన్ని గంటలపాటు ప్రాణాపాయం నుంచి కాపాడి అనంతరం మెరుగైన చికిత్స కోసం ఏదైనా ఆసుపత్రికి తీసుకెళ్లే



అవకాశం ఉంటుంది. బస్సుల్లో అలాంటి సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అం తేకాక బస్సుల్లో ఆపరిశుభ్రత నెలకొంది. ప్రతిరోజూ బస్సులను శుభ్రం చేయాల్సి ఉన్నా, చేయడంలేదు. దీంతో బస్సుల్లో ప్రయాణికుల దుస్తులు దుమ్ము, ధూళి, మట్టితో మాసిపోతున్నాయి. పలు బస్సులకు కిటికీలకు ఉండాల్సిన అద్దాలు లేక వర్షాకాలంలో ప్రయాణికులు తడుస్తున్నారు.

కానరాని మెడికల్ కిట్లు

బస్సులో డ్రైవర్ సీటు వెనకభాగంలో ప్రథమచికిత్సకు సంబంధించిన పెట్టెలను ఏర్పాటు చేస్తుంటారు. కానీ అవి ఖాళీగా ఉంటున్నాయి. గతంలో మెడికల్ కిట్లు ఉండేవి. అందులో ప్రథమ చికిత్సకు సంబంధించిన దూది, అయోడిన్, బ్యాండేజ్, కట్టుదుస్తులతో పాటు ఇతర ఔషధాలు ఉండేది. ప్రస్తుతం కనీసం ప్రథమ చికిత్సకు సం బంధించిన ఎలాంటి ఔషధాలు ఉండడంలేదు. ప్రయాణికులకు ఏదైనా గాయమైనా దగ్గరలోని ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా ఆర్టీసీ సంస్థ సిబ్బందితో పాటు ప్రయాణికులకు అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

ఔషధాల ఏర్పాటుపై దృష్టి సారిస్తాం


ఆర్టీసీ బస్సుల్లో అత్యవసర మందుల ఏర్పాటుపై దృష్టి సారిస్తాం. రవాణా సౌకర్యాలు మెరుగుపడడం, అత్యవసర సేవలందించే 108 అంబులెన్ ్సలు అందుబాటులోకి రావడంతో ప్రథమ చికిత్సకు సంబంధించిన ఔషధాల విషయంలో దృష్టి సారించలేకపోయాం. ప్రస్తుతం బస్సుల్లో ఔషధాలు ఉండడంలేదు. సంస్థ ఉన్నతాధికారులతో సంప్రదించి అత్యవసర సమయంలో వినియోగించే ఔషధాలను అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతాం.

## వీధికుక్కలతో పరేషాన

భువనగిరి టౌన, జిల్లా కేంద్రం భువనగిరి పట్టణ ప్రజలను వీధి కుక్కలు భయపెడుతున్నాయి. ఒంటరిగా నడుచుకుంటూ వెళ్లినా, బైకులపై వెళ్లినా వీధి కుక్కల గుంపు భౌ భౌ అని బిగ్గరగా భయపడేలా అరుస్తూ వెంటాడుతున్నాయి. దీంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు జంకుతున్న పరిస్థితి. పలువురు మహిళలు మార్నింగ్ వాక్ మానివేశారు. పలువురు వీధి కుక్కల దాడిలో గాయపడుతూ రేబిస్ ఇంజక్షన్ల కోసం ఆస్పత్రుల బాటపడుతున్నారు. మరికొందరు కాళ్లు, చేతులు విరిగి నెలల తరబడి బెడ్‌కు పరిమితమవుతున్నారు. దీంతో తాము ఎదుర్కొంటున్న ప్రధాన ఇబ్బందుల్లో వీధి కుక్కల సమస్య మొదటిదిగా పలువురు పేర్కొంటుండటం కుక్కల సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. వీధి కుక్కల అదుపునకు వాటి పునరుత్పత్తిని నియంత్రించే లక్ష్యంతో రూ.45 లక్షల వ్యయంతో పట్టణ శివారులోని హన్మాపూర్‌లో నిర్మించిన జంతువుల శస్త్రచికిత్స కేంద్రం ఆర్భాటానికే పరిమితమయింది. దీంతో వీధి కుక్కల నియంత్రణపై అధికారులు ప్రేక్షక పాత్రకే పరిమితమైన పరిస్థితి. వీధి కుక్కల విజృంభన ఇలాగే కొనసాగితే సమీప కాలంలో మరింత భయంకరమైన పరిస్థితులు నెలకొంటాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వీధి కుక్కల నియంత్రణకు చిత్తశుద్ధి చూపాలని కోరుతున్నారు.

ఇంటి నుంచి బయటకు రావాలంటే వీధి కుక్కలు భయపెడుతున్నవి. ఇంటి ముందే గుంపుగా ఉంటూ బయటకు రాగానే బిగ్గరగా అరుస్తున్నాయు. వీటి భయంతో నాతో పాటే పలువురు మహిళలు కూడా మార్నింగ్ వాక్ మానివేశారు. పిల్లలు ఇంటి ముందు ఆడుకోలేని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. వీధి కుక్కల పునరుత్పత్తి నియంత్రణకు జంతు జనన నియంత్రణ కేంద్రంలో శస్త్ర చికిత్సలు నిర్వహించేలా సంబంధిత ఏజెన్సీతో ఇటీవలే మాట్లాడాం. త్వరలోనే కార్యాచరణ ప్రారంభిస్తాం. క్రమేపీ



వీధి కుక్కల సంఖ్యను తగ్గిస్తాం.

## భవితకు ఔషధం.. బాల్యంపై భరోసా

ములుగు విద్యార్థులు క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అమ్మానాన్నలు తిట్టారని, వారు ఆశించిన విధంగా మార్కులు రాలేదని తప్పుడు నిర్ణయాలు తీసుకుని జీవితాన్ని చాలిస్తున్నారు. చివరకు తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగుల్చుతున్నారు. ఇలాంటి పరిస్థితులను అధిగమించి పిల్లల్లో మార్పు తీసుకురావడానికి ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర సంకల్పించారు. విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి ఉన్నతులుగా ఎదిగేలా ప్రేరణ కలిగించేందుకు జిల్లాలో వినూత్నంగా 'బాల్యంపై భరోసా' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

జిల్లా సంక్షేమ శాఖ పరిధిలోని సఖి, బాలల సంరక్షణ, చైల్డ్ హెల్ప్‌లైన్, మహిళా సాధికారత విభాగాల నుంచి మూడు బృందాలు ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో నలుగురు సభ్యులు ఉంటారు.




ప్రతి బృందం రోజుకు రెండు అవగాహన కార్యక్రమాల చొప్పున నిర్వహించాలని ప్రణాళిక రూపొందించుకుని ముందుకెళుతోంది.

బృంద సభ్యులు జులై 22 నుంచి ఆగస్టు 6వ తేదీ వరకు జిల్లాలోని పలు విద్యాలయాల్లో కార్యక్రమాలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించుకున్నారు. పద్నాలుగు రోజుల్లో వివిధ రకాల 84 గురుకులాలను ఎంచుకున్నారు. జిల్లాలోని ములుగు మండలంలో 25, వెంకటాపూర్ మండలంలో 5, గోవిందరావుపేట 9 తాడ్వాయి 11, ఏటూరునాగారం 13, కన్నాయిగూడెం 4, మంగపేట 5, వాజేడు 5, వెంకటాపురం మండలంలో 7 విద్యాలయాలు ఉన్నాయి.

లక్ష్యాన్ని ఎలా చేరుకోవాలో చక్కగా వివరించారని వెంకటాపూర్‌లోని మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని వైష్టవి చెబుతోంది. ఒత్తిడికి గురైనప్పుడు ధ్యానం అవసరం. ఒకరితో పోల్చుకోకుండా, పోటీతత్వాన్ని అలవాటు చేసుకోవాలి. ధైర్యంతో ముందుకెళ్లాలి. ఇబ్బందికరమైన పరిస్థితుల్లో ఎలా ఉండాలో తెలిసింది.

## వేగంగా 'గోదాం' పనులు

భువనగిరి రూరల్, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, మౌలిక వసతులు, సదుపాయాల సంస్థ ఆధ్వర్యంలో భువనగిరి మండలంలోని ముత్తిరెడ్డిగూడెం శివారులో నిర్మిస్తున్న ఔషధ గోదాం పనులు చకా చకా సాగుతున్నాయి. వైద్య సేవలు, మౌలిక వసతుల సదుపాయాల సంస్థ జాతీయ ఆరోగ్య మిషన్ రూ.3.60కోట్లు మంజూరు చేయగా, జూన్ 2న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. 13 వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో ఈ గోదాం నిర్మాణ పను లు కొనసాగుతున్నాయి. తొమ్మిది నెలల గడువులోగా ఈ గోదాంను వినియోగంలోకి తీసుకురావాలని వైద్య ఆరోగ్యశాఖ మౌలిక సదుపాయాల కల్పన ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

జిల్లాలోనే మందుల నిల్వలు

జిల్లా పరిధిలోని 17 మండలాల్లో 21 ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు 99 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, 42 వైద్య ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. వీటికి సంబంధించి ఔషధ మందులు, బ్యాండేజీలు, ఆరోగ్య కిట్లు భద్రపరిచేందుకు ప్రభుత్వం ఈ గోదాం నిర్మాణానికి పూనుకుంది.

అయితే ఈ నిర్మాణం పూర్తయితే హైదరాబాద్‌లోని ఔషధ నిల్వల డిపో నుంచి నేరుగా ఈ మందులను ఇక్కడే నిల్వచేసి జిల్లాలోని వివిధ వైద్య ఆరోగ్య కేంద్రాలకు తరలిస్తారు. ప్రస్తుతం నల్లగొండ జిల్లా నుంచి దిగుమతి చేసుకొని, పాత బస్టాండ్ సమీపంలోని పాత మునిసిపాలిటీలో ఇరుకైన భవనంలో నిల్వలను భద్రపరుస్తున్నారు. ఈ గోదాం నిర్మాణం పూర్తయితే ఔషధ నిల్వల మరింత భద్రంగా, సురక్షితంగా ఉండే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

ఔషధ నిల్వల కోసం మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ, జాతీయ హెల్త్ మిషన్ రూ.3.60కోట్లు మంజూరు చేసింది. గత నెల జూన్2న శంకుస్థాపన చేశారు. భవనాన్ని త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తెస్తాం.



# వర్షాకాలం మారిందా అన్నట్లు.. వరుణుడే లేనట్లు..

నల్గొండ ే: వరుణుడు ముఖం చాటేయడంతో జిల్లాలో చెరువులు, కుంటల ఎండిపోయి నోర్లు తెరిచాయి. వానాకాలం ప్రారంభమై రెండు నెలలు దాటినా.. జిల్లాలో భారీ వర్షాలు లేక సుమారు 1,180 చెరువుల్లో భూపగుళ్లు పట్టాయి. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. బోరు బావుల్లో నీటి శాతం పడిపోవడంతో వాటి కింద సేద్యం అగమ్యగోచరంగా మారింది. పెరిగిన నారు నాటేందుకు నీటి కొరత ఉత్పన్నం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మూసీ పరివాహక ప్రాంతాల్లో మాత్రమే చెరువుల్లోకి కాస్త నీరు చేరాయి.

మత్స్యకారుల ఆందోళన..!

చెరువుల్లోకి వరద నీరు చేరకపోవడంతో రైతులు ఆందోళన చెందుతుండగా.. మరోవైపు మత్స్యకారులు లోటు వర్షపాతంతో చేపల పెంపకంపై మదన పడుతున్నారు. కొన్నాళ్లుగా జిల్లాలో లక్ష్యానికి మంచి చేపల ఉత్పత్తి జరిగింది. కానీ ఈ ఏడాది ఆగస్టు నెల ప్రారంభం అవుతున్నా.. ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో చేపల పెంపకంపై నీలినీడలు కుమ్ముకున్నాయి. అవకాశం ఉన్న ప్రాంతాల్లో సాగర్ ఎడమ కాల్వ, ఏఎమ్మార్పీ కాల్వల ద్వారా చెరువులను నింపాలని రైతులు, మత్స్యకార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

జులై 30 నాటికి నీటి నిల్వ వివరాలు ఇలా

జిల్లాలో 1628 చెరువులు ఉండగా అందులో ఇప్పటి వరకు మూసీ పరివాహక ప్రాంతంలో నాలుగు మాత్రమే నిండాయి. 97 చెరువులు సగానికి నిండగా 1108 చోట్ల చుక్క నీరు చేరకపోవడంతో పగుళ్ల పట్టాయి. ప్రధానంగా మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లో వరద నీరు చేరకపోవడంతో ఆయా ప్రాంతాల్లో రైతులు తీవ్ర ఆందోళన పడుతున్నారు.

# కోతలు కాదు.. కొలతలు పెరగాలి..

, కొత్తగూడెం: పరిహార అటవీకరణ నిధి నిర్వహణ, ప్రణాళిక ప్రాధికార సంస్థ(కాంపా) నిధులతో చేపడుతున్న పనులు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో మిశ్రమ ఫలితాలు ఇస్తున్నాయి. ఒకవైపు అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తుంటే.. మరోవైపు విచ్చలవిడిగా పోడు చేయటంతో లక్ష్యం నీరుగారుతున్నట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. అభివృద్ధి ప్రాజెక్టులు, ఆక్రమణల వల్ల హరించుకుపోతున్న అటవీ భూములకు పరిహారంగా ఉభయ జిల్లాల్లో చేపడుతున్న అటవీకరణ యత్నాలు క్రమంగా పురోగతి సాధిస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

క్రమేణా తగ్గుతున్న అటవీ విస్తీర్ణం



ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో అడవుల విస్తీర్ణం క్రమేణా తగ్గుతోంది. వ్యవసాయం, అనుబంధ రంగాలు, పారిశ్రామిక ప్రాంతాలు విస్తరించటంతో పాటు పోడు సమస్య అటవీ విస్తీర్ణంపై ప్రభావం చూపుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 2021-23 మధ్యకాలంలో అటవీ విస్తీర్ణం తగ్గిన జిల్లాల జాబితాలో ఆదిలాబాద్(–115.50 చ.కి.మీ) తర్వాత భద్రాద్రి జిల్లా(–95.55 చ.కి.మీ) రెండోస్థానంలో నిలవగా.. ఖమ్మం (–25.76 చ.కి.మీ) ఏడో స్థానంలో ఉంది.

అరకొరగా కేటాయింపులు..

ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు కాంపా నిధుల కేటాయింపుల్లో కోతలే అధికంగా ఉంటున్నాయి. భద్రాద్రి జిల్లా అటవీ అధికారులు 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.100.57కోట్లతో ప్రతిపాదనలు పంపిస్తే.. రూ.30.62కోట్లు మంజూరయ్యాయి. ఖమ్మం జిల్లాకు రూ.8.46కోట్లు కేటాయించగా.. గత మార్చి నాటికి రూ.3.71కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. 2025–26 ఆర్థిక సంవత్సరానికి భద్రాద్రికి రూ.30.47కోట్లు, ఖమ్మం జిల్లాకు 7.73కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు డీఎఫ్ఓలు కిష్టాగౌడ్, సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ 'ఈనాడు'కు తెలిపారు. ఈ ఏడాది నిధుల కేటాయింపు ఏ విధంగా ఉంటుందనేది వచ్చే నెలలో తేలనుంది.

అడవుల పెంపకంపై ప్రత్యేక దృష్టి

గతంలో మంజూరైన కాంపా నిధులతో సోలార్ పంప్‌సెట్లు, నీటికుంటలు, సిబ్బందికి క్వార్టర్ల నిర్మాణంతో పాటు బేస్‌క్యాంపు సిబ్బందికి జీతభత్యాలు చెల్లించేవారు. ఈఏడాది కేటాయించే నిధులతో కేవలం ప్లాంటేషన్ల పెంపకం, ఫెన్సింగ్ వంటివి మాత్రమే చేపట్టేలా మార్గదర్శకాలు వెలువడినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. సింగరేణి గనులు, రహదారుల నిర్మాణం, ఇతరత్రా అభివృద్ధి పనుల కోసం ఏమేరకు అటవీ విస్తీర్ణం కోల్పోతే అంతే మొత్తం అడవులను పెంచేలా చర్యలు తీసుకోనున్నారు. నర్సరీలు, ప్లాంటేషన్ల పెంపకంపై జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో పకడ్బందీ పర్యవేక్షణ ఉంటుందన్నారు.

ఈ ఏడాది కాంపా నిధుల కేటాయింపుల్లో నూతన విధానం అమలుచేస్తున్నారు.

# పునరుద్ధరణకు ఆటంకాలు

మహబూబాబాద్: గత ఏడాది ఆగస్టు 31–సెప్టెంబరు 1న కురిసిన భారీ వర్షాలకు ఆకేరువాగు వరదపోటెత్తింది. దీంతో రోడ్లు కొట్టుకుపోయాయి. పలుచోట్ల చెరువు కట్టలు తెగిపోయాయి. ఈ వరద ప్రభావిత ప్రాంతాల్లో అప్పట్లో తాత్కాలిక మరమ్మతులు జరిగినప్పటికీ..శాశ్వత ప్రాతిపదికన చేపట్టాల్సి ఉంది. వీటిల్లో కొన్ని పనులు ప్రతిపాదన దశలో ఉండగా..మరొకొన్ని నిధులు మంజూరైనప్పటికీ ఇప్పటికే వర్షాలు మొదలైన పరిస్థితుల్లో పనుచేయలేమంటున్నారు. ఈ పరిణామాలు పునరుద్ధరణ శాశ్వత



పనుల్లో ముందడుగు పడకుండా చేస్తున్నాయి.

పలుచోట్ల చెరువులకు తాత్కాలిక మరమ్మతులు చేసినప్పటికీ పెద్దఎత్తున కట్ట కోతకు గురైన చోట శాశ్వత మరమ్మతులు చేపట్టడమే పరిష్కారమని నిర్ణయించారు. సాంకేతిక అనుమతులు, నిధుల మంజూరు విషయాల్లో ఆలస్యం జరిగింది. ఇటీవల నిధులు వచ్చినా పనులు వర్షాకాలం పోయాకే చేస్తామంటున్నారు.

ఆయకట్టు పరిస్థితి ప్రశ్నార్థకరం

నెల్లికుదురు మండలం రావిరాల చెరువు కట్ట పునర్నిర్మాణానికి రూ.53 కోట్లు మంజూరవ్వటంతో టెండరు ప్రక్రియ కూడా పూర్తి చేశారు. వానలు ఆగాక కానీ పనులు చేయలేని పరిస్థితి నెలకొనగా ఈ సీజన్‌లో వర్షం నీరు నిలవడం ప్రశ్నార్థకంగా మారింది.

రాజులకొత్తపల్లి చెరువు కట్టకు గండ్లుపడ్డాయి. నీళ్లు నిలవని కారణంగా..510 ఎకరాల సాగుపై ప్రభావం పడనుంది.

చిన్నగూడూరులోని ఉగ్గంపల్లి చెక్‌డ్యాం కట్ట తెగిపోవటంతో నీరు నిలువక..రెండు కాలువల కింద సుమారు వెయ్యి ఎకరాలపై ప్రభావం పడనుంది. మరిపెడ మండలంలోని చెక్‌డ్యామ్‌లకు కూడా మరమ్మతులు చేయాల్సి ఉంది.

ప్రతిపాదనలకే పరిమితం

మరిపెడ మండలంలో తానంచర్ల పాలేరు వాగుపై లో లెవల్ వంతెనకొట్టుకుపోగా, తాత్కాలిక మరమ్మతులు చేశారు. శాశ్వత పనుల ప్రతిపాదనలపై పురోగతి లేదు. వర్షాకాలంలో లోలెవల్ వంతెన మీద నుంచి నీరు పారితే పది గిరిజన తండాల వారు అయిదు కిమీ చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుందని చెబుతున్నారు.

డోర్నకల్ మండలంలో మహబూబాబాద్– ఖమ్మం మార్గంలో ముల్కలపల్లి వద్ద ఆకేరు వాగుపై హైలెవల్ వంతెన కొట్టుకుపోగా.. పూర్వం రాకపోకలు సాగించిన లోలెవల్ వంతెననే ప్రస్తుతం వినియోగిస్తున్నారు. ఆకేరు పొంగితే రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉందంటున్నారు.

నెల్లికుదురు ప్రాంతంలో రోడ్ల పునర్నిర్మాణ పనులకు ప్రతిపాదనలు చేసినప్పటికీ పనులు మొదలుకాలేదు.

మరిపెడ మండలం ధర్మారం గ్రామంలోని వంతెన వరదకు కొట్టుకుపోయింది.. పునర్నిర్మాణ పనులపై పురోగతి లేదు. ధర్మారం వానులు ఖమ్మం వైపు వెళ్లటానికి.. అటువైపు వారు మహబూబాబాద్ వైపు రావటానికి దూర ప్రాంతం నుంచి తిరిగి రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

# నమూనా అసంపూర్తి..

మహబూబాబాద్ నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండల కేంద్రానికి ఓ నమూనాను తీర్చిదిద్దాలని నిర్ణయించింది. దీని ద్వారా లబ్ధిదారులకు



అవగాహన కల్పించాలని నిర్ణయించినా.. వాటి నిర్మాణాలే అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఈమేరకు జిల్లాలోని మరిపెడలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నమూనా గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జిల్లాలోని మరిపెడ, డోర్నకల్, మహబూబాబాద్ మినహా మిగిలిన మండలాల్లో నమూనా గృహాలు వివిధ దశల్లోనే నిలిచిపోయాయి.

జిల్లాలో కొత్తగా ఏర్పాటైన దంతాలపల్లి, పెద్దవంగర, చిన్నగూడూరు, ఇనుగుర్తి, సీరోలు మండలాల్లో సొంత స్థలాలు లేక నిర్మాణాలు ప్రారంభించలేదు. కురవి మండల పరిషత్ కార్యాలయంలో స్థల భావం వల్ల నిర్మించలేదు.

పునాది స్థాయిలోనే

నర్సింహులపేటలో మూడు నెలల కిందట ప్రారంభించిన ఇందిరమ్మ నమూనా ఇల్లు పునాదుల వద్దనే నిలిచిపోయింది. ఇంటిని చూద్దామని కార్యాలయానికి వచ్చినవారికి పునాదులే దర్శనమిస్తున్నాయి.

కేసముద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ నమూనా గృహాన్ని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ శంకుస్థాపన చేశారు. ఇంటి నిర్మాణంలో జాప్యం చేస్తూ గుత్తేదారుడు నత్తనడకన నిర్మాణ పనులు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం పూర్తి రాయితీతో రూ. 5 లక్షలు మంజూరు చేస్తోంది. సొంత స్థలం ఉండి డబ్బులు లేక ఇళ్లు నిర్మాణం చేసుకోలేనివారికి ప్రభుత్వం మంజూరు చేసే నిధులతో తక్కువ వ్యయంతో ఇంటి నిర్మాణం ఏ విధంగా చేసుకోవచ్చో ప్రభుత్వమే వాటి వివరాలను గణాంకాలతో ప్రకటించింది. 400 నుంచి 600 చదరపు గజాల విస్తీర్ణంలోపు నిర్మాణం పూర్తి చేసే నమూనాలను రూపొందించింది. ఇందిరమ్మ ఇల్లు ఎలా ఉంటుందో ప్రత్యక్షంగా లబ్ధిదారు వచ్చి చూసే విధంగా నిర్మాణం ప్రారంభించిన ఆ గృహాలు పూర్తికాలేదు. ఆకర్షణీయంగా కనిపించాల్సిన నమూనా గృహనిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో వివిధ ప్రాంతాల నుంచి మండల కార్యాలయాలకు వచ్చినవారు ఆ గృహాలను చూసి తిరిగి వెళ్లిపోతున్నారు. వాటి నిర్మాణాలు పూర్తి చేస్తే లబ్ధిదారులను ఆకర్షించవచ్చు.



# నడవనివ్వని కాళ్లు.. కాలుతున్న ఒళ్లు..

నల్గొండ జిల్లాలో వర్షాలు అనుకున్న స్థాయిలో కురువకపోయినా.. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణానది ప్రాంతం కాలువలు, కుంటలు నిండటంతో పాటు దోమలు విపరీతంగా స్వైరవిహారం చేస్తున్నాయి. చిన్నపాటి వర్షాలకే రోడ్లు, కాలువలు చిత్తడిగా మారుతున్నాయి. జిల్లా అంతటా సీజనల్ వ్యాధులు గుప్పుమంటున్నాయి. జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రితో పాటు ఏరియా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. జనరల్ ఆసుపత్రిలో సాధారణంగా రోజుకు 550 నుంచి 650 వరకు ఉండే ఓపీ నాలుగు రోజుల నుంచి 800కి చేరింది. ఐపీ రోగులు 600 మందికి పైగా ఉన్నారు. మధ్యాహ్నం 12 గంటల తరువాత వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో ఉండని కారణంగా ప్రైవేట్ బాట పడుతున్నారు. నాగార్జునసాగర్, మిర్యాలగూడ, దేవరకొండ, హాలియా, చందంపేట, డిండి, మల్లేపల్లి, దామరచర్ల ప్రాంతాల నుంచి జ్వర పీడితులు ఆసుపత్రులో ఎక్కువగా చేరుతున్నారు.

చిట్యాల: చిట్యాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రధానంగా ఒళ్లు, గొంతునొప్పులు, జలుబు, దగ్గు, సాధారణ జ్వరాలకు సంబంధించిన పేషెంట్లు ఎక్కువగా వస్తున్నారని వైద్యుడు సత్యనరేష్ పేర్కొన్నారు. అవసరమైన ఔషధాలు పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వనిపాకలలో డెంగీ కేసును గుర్తించారు.

నకిరేకల్: నకిరేకల్ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు వస్తున్న రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. నిత్యం 280 నుంచి 300 మంది వరకు బయటి రోగులు వస్తున్నారు. మండలంలోని ఓగోడు పీహెచ్‌సీ, గ్రామాల్లో ఉన్న 11 ఉపకేంద్రాల్లో జూన్‌లో 7,177, జులైలో ఇప్పటి వరకు 6,892 మంది ఓపీ సేవలు పొందారు. జలుబు, దగ్గు, జ్వరం, ఒంటి నొప్పులు, కాళ్లు, కీళ్ల నొప్పులు, అతిసారంతో బాధపడుతున్న వారే అధికంగా ఉంటున్నారని వైద్యులు వివరించారు. నకిరేకల్ ప్రాంతీయ వైద్యశాల, పీహెచ్‌సీ, ఉప కేంద్రాలల్లో మే, జూన్ మాసాలతోపాటు జులైలో మంగళవారం వరకు మొత్తం 42,962 మంది పలు అనారోగ్య సమస్యలతో ఓపీ చికిత్సలు పొందినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.



# యూరియా పక్కదారి పట్టించిన నిందితుల అరెస్టు

చిట్యాల గ్రామీణం, వెలిమినేడు పీఏసీఎస్ కేంద్రంగా ఆరు నెలలుగా రాయితీ యూరియాను పక్కదారి పట్టించిన నిందితులను గురువారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం నల్గొండ డీఎస్పీ శివరాంరెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

ఎటువంటి అనుమతుల్లేకుండా రాయితీ యూరియాను ఉపయోగించి నిందితులు అక్రమ మార్గంలో బీఎస్–6 వాహనాల్లో ఉపయోగించే డెఫ్(డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్)ను తయారు చేసి విక్రయిస్తున్నారు. బిహార్‌కు చెందిన నాగదేవ్ శంకర్‌యాదవ్ పదేళ్ల క్రితం వెలిమినేడు గ్రామానికి వచ్చి జాతీయ రహదారి పక్కన దాబా హోటల్‌ను నిర్వహిస్తున్నారు. ఆదాయం సరిపోకపోవడంతో రాజస్థాన్‌కి చెందిన ఓ వ్యక్తి ద్వారా ఛత్తీస్‌గఢ్‌లో ట్రైనింగ్ తీసుకుని దాబా హోటల్ పక్కనే ఉన్న టేకుల అంజిరెడ్డికి చెందిన ప్లాట్‌లో డెఫ్ తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. దీనికి ఉపయోగించే యూరియాను హైదరాబాద్‌లో రూ.1,500 లకు బస్తా చొప్పున కొనుగోలు చేసి వినియోగించేవాడు. ఉత్పత్తి ఖర్చు ఎక్కువ అవుతుందనే ఉద్దేశంతో సబ్సిడీ ద్వారా రూ.300లకే బస్తా దొరుకుతుందనే విషయాన్ని గ్రామానికి చెందిన గోలి శంకరయ్య ద్వారా తెలుసుకున్నారు. దీంతో ఇద్దరు కలిసి వెలిమినేడు పీఏసీఎస్‌లో పనిచేస్తున్న దుర్గయ్య అనే వ్యక్తికి బస్తాకు రూ.30 కమీషన్ ఇస్తామని చెప్పి అక్కడి నుంచి అక్రమంగా యూరియాను తీసుకువచ్చి డెఫ్‌లో వినియోగిస్తున్నారు.

వెలిమినేడుతో పాటుగా చిట్యాల, గుండ్రాంపల్లి, చౌటుప్పల్ పీఏసీఎస్‌ల నుంచి కూడా తక్కువ ధరకు తీసుకువచ్చి డెఫ్ తయారు చేసి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. రైతులకు యూరియా అందుబాటులో లేకుండా కృత్రిమ కొరత సృష్టిస్తూ అక్రమాలకు పాల్పడిన బిహార్‌కు చెందిన నాగదేవ్ శంకర్ యాదవ్, వెలిమినేడుకు చెందిన గోలి శంకరయ్య, మేడగోని దుర్గయ్యలతో పాటు వారికి సహకరించిన వినోద్‌కుమార్, రాజీవ్‌రాయ్, రోషన్‌కుమార్‌లను మండల వ్యవసాయాధికారి పగిడిమర్రి గిరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదుపులోకి తీసుకున్నామన్నారు.

అక్రమంగా యూరియా నిల్వ చేసిన ప్రదేశాన్ని పరిశీలించి నిల్వ ఉంచిన 130 బస్తాల రాయితీ యూరియా, వాహనం, ఆటో, డెఫ్ ఉత్పత్తి చేసే యంత్ర పరికరాలు, 1000 లీటర్ల సామర్థ్యం కలిగిన 16 ప్లాస్టిక్ డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును ఛేదించిన సీఐ నాగరాజు, ఎస్సై రవి కుమార్, సిబ్బంది మధు, వెంకట్, కలీమ్, సాయి, గణేశ్, జాన్‌రెడ్డి, వెంకటేశ్వర్లులను ఎస్పీ అభినందించినట్లు పేర్కొన్నారు.

# సన్నకారు.. బేజారు

రాజపేట, భువనగిరి, రైతులకు పెట్టుబడి తడిసి మోపెడవుతోంది. మరోవైపు సకాలంలో పంట రుణాలు దొరకడం లేదు. జిల్లాలో సన్న, చిన్నకారు రైతులు పంటలేయాలంటే పెరిగిన ఖర్చుల కారణంగా భయపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. నారుమళ్లు సిద్ధమై నెల గడిచినా ఆలస్యంగా కురిసిన ఓ మోస్తరు ముసురు కారణంగా కొందరు ఇంకా నాట్లేసే దశలోనే ఉన్నారు. ఇంకొందరు యంత్రాల కోసం యజమానుల చుట్టూ తిరుగుతున్నారు. మరికొందరు కూలీల కోసం ఎదురు చూస్తున్నారు. అటు వరుణుడు, ఇటు కూలీల కొరత, మరోపక్క పెరుగుతున్న ఖర్చులు రైతన్నను కుంగదీస్తున్నాయి.

వేధిస్తున్న కూలీల కొరత



జిల్లా వ్యాప్తంగా సుమారు 80 శాతం మంది కూలీలపైనే ఆధారపడి సాగుకు ఉపక్రమిస్తారు. పెద్ద రైతులకు సొంత యంత్రాలున్నాయి. సన్నకారు రైతులు అద్దెను చెల్లించి సాగు చేపట్టాల్సిన పరిస్థితి. ఒక్కో ఎకరానికి రూ.20 వేలకు పైగా పెట్టుబడి అవుతుంది. అప్పోసప్పో చేసి నాట్లు వేద్దామని ముందుకొచ్చినా కూలీల కొరత వేధిస్తోంది. రోజుకు మహిళలకు రూ.500, పురుషులకు రూ.600 ఇస్తామన్నా పనులకు రావడం లేదని పలువురు రైతులు అంటున్నారు. ఇంకొందరు పొరుగు రాష్ట్రాల కూలీలతో వరినాట్లకు పూనుకున్నారు.

నూతన పద్ధతుల ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి. కూలీలపైన ఆధారపడకుండా చిన్నపాటి యంత్రాల వినియోగం పెరగాలి. సాధ్యమైన మేరలో సొంతంగా పనులు చేసుకుంటే ఖర్చులు చాలా తగ్గుతాయి. సాగుకు అనుబంధంగా పాడి పరిశ్రమ, కూరగాయల పెంపకం లాంటివి చేపడితే ప్రయోజనం ఉంటుంది.

## నిప్పులు చెరిగిన స్టార్క్..
# 172 పరుగులకు ఇంగ్లాండ్ ఆలౌట్



యాషెస్ సిరీస్‌లో భాగంగా పెర్త్ వేదికగా మొదటి టెస్ట్‌లో ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా తలపడుతున్నాయి. ఈ మ్యాచ్‌లో ఆసీస్ బౌలర్లు విజృంభించారు. దీంతో ఇంగ్లాండ్ 172 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లాండ్ బ్యాటర్లలో ఓలీపోప్ (46), హ్యారీ బ్రూక్ (52) మాత్రమే రాణించారు. జెమీ స్మిత్ (33), బెన్ డకెట్ (21) ఫర్వాలేదనిపించారు. మిగతా బ్యాటర్లంతా చేతులెత్తేశారు. మొదట టాస్ గెలిచిన ఇంగ్లాండ్ జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఆరంభంలోనే ఇంగ్లిష్ జట్టుకు షాక్ తగిలింది. మిచెల్ స్టార్క్ (0.6) బౌలింగ్‌లో ఓపెనర్ జాక్ క్రాలీ.. ఉస్మాన్ ఖవాజాకు క్యాచ్ ఇచ్చి డకౌట్‌గా వెనుదిరిగాడు. తర్వాత బెన్ డకెట్ (21), జోరూట్ (0) వికెట్లను కూడా స్టార్క్ తీసుకున్నాడు. దీంతో 39 పరుగులకే ఇంగ్లాండ్ మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. అనంతరం ఓలీపోప్, హ్యారీ బ్రూక్, జెమ్మీ స్మిత్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. కానీ మిచెల్ స్టార్క్ విజృంభణతో ఇంగ్లాండ్ జట్టు 32.5 ఓవర్లలో 172 పరుగులకే ఆలౌటైంది. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్ 7, బ్రెండన్ డొగ్గెట్ 2, గ్రీన్ 1 వికెట్ తీసుకున్నారు.




## సోషల్ మీడియా ప్రభావానికి గురి కావొద్దు
# వేలంను ఆపేయండి
### : రిచా ఘోష్‌కు సానియా మీర్జా సూచన




ఆరుసార్లు గ్రాండ్‌స్లామ్ ఛాంపియన్‌గా నిలిచిన సానియా మీర్జా, భారత మహిళల క్రికెట్ జట్టు సభ్యురాలు రిచా ఘోష్‌కు సోషల్‌మీడియా గురించి ఒక సలహా ఇచ్చారు. బెంగళూరు టెక్ సమ్మిట్ 2025 దీనికి వేదికైంది. 'రిచా ఘోష్ ఇంకా యువ క్రీడాకారిణి. ప్రస్తుతతరం ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాను చూస్తోంది. కానీ మా రోజుల్లో ఎక్కువగా వార్త పత్రికల పైనే ఆధారపడేవాళ్లం. ఎప్పుడైతే ఎలక్ట్రానిక్ మీడియా వచ్చిందో అప్పటినుంచి వ్యక్తిగత జీవితాల మీద ఫోకస్ పెరిగింది. ఏదైనా మ్యాచ్ ఓడిపోతే.. ముందురోజు డిన్నర్‌కు వెళ్లడం వల్లే ఇలా జరిగిందంటూ లేనిపోని కథనాలు అల్లేవారు' అని సానియా మీర్జా వాపోయారు. 'అయితే.. నేను ఇలాంటి వాటిని పెద్దగా పట్టించుకోను. నాకు ఇవన్నీ హాస్యాస్పదంగా అనిపించేవి. ఒక్కసారి కూడా క్రికెట్ బ్యాట్, టెన్నిస్ రాకెట్, బాక్సింగ్ గ్లౌవ్స్ తమ చేత్తో తాకనివారు కూడా క్రీడాకారుల గురించి అలా అనడం నాకు నవ్వు తెప్పించేది. నాకు వాళ్లను చూస్తే చిరాకు కంటే, జాలి కలిగేది. ఎందుకంటే.. వారి జీవితంలో ఆనందంగా లేనివారే, ఇలా దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వారిపై బురద చల్లే ప్రయత్నం చేస్తారు. మంచైనా, చెడైనా, దేన్నైనా సరే.. మన మనసులోకి తీసుకోవద్దు. ముఖ్యంగా సోషల్ మీడియా ప్రభావం మన మీద ఉండకుండా చూసుకోవాలి. దానికి అసలు అంతగా ప్రాధాన్యం ఇవ్వకూడదు' అని సానియా మీర్జా, రిచాఘోష్‌కు సూచించారు. 'నిజాయతీగా చెప్పాలంటే.. మొదట్లో మహిళల క్రికెట్‌కు అంత ఆదరణ ఉండేది కాదు. అభిమానులు కూడా పెద్ద సంఖ్యలో ఉండేవారు కాదు. కానీ ప్రస్తుతం పరిస్థితులు మారాయి. పొగిడేవారితో పాటు విమర్శించేవారూ పెరుగుతారు. అందుకే నేను పాజిటివ్ విషయాల పైనే దృష్టిపెట్టేందుకు ప్రయత్నిస్తా' అని రిచా ఘోష్ అన్నారు.

## ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ తొలి సెమీస్..
# సూపర్ ఓవర్‌లో ఓడిన భారత్ ఏ




దోహా: ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో బంగ్లాదేశ్ ఏ, భారత్ ఏ మధ్య చివరి బంతి వరకూ ఉత్కంఠగా సాగిన సెమీ ఫైనల్స్ సూపర్ ఓవర్‌కు దారి తీసింది. 195 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇండియా ఏ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 194 పరుగులు చేసింది. సూపర్ ఓవర్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ ఏ తొలి రెండు బంతుల్లో పరుగులేమీ చేయకుండా రెండు వికెట్లు కోల్పోయింది. దీంతో ఆలౌట్ అయ్యింది. ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్‌కు ఒక్క పరుగు వైడ్ రూపంలో రావడంతో విజేతగా నిలిచి ఫైనల్‌లోకి దూసుకెళ్లింది. అంతకుముందు ఇండియా ఏ ఓపెనర్లు ప్రియాంశ్ ఆర్యా (44), వైభవ్ సూర్యవంశీ (38) ధాటిగా ఇన్నింగ్స్‌ను ఆరంభించగా.. మధ్యలో జితేశ్ శర్మ (33), నేహాల్ వధేరా (32) రాణించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ ఏ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసింది. ఓపెనర్ రెహ్మాన్ సోహాన్ 65, మెహెరోబ్ 48, జీషాన్ ఆలం 26 పరుగులతో రాణించారు. గుర్జప్‌నీత్ సింగ్ 2 వికెట్లు తీయగా.. హర్ష్ దూబే, సుయాశ్ శర్మ, రమణ్‌దీప్ సింగ్, నమన్ ధీర్ తలో వికెట్ తీశారు.




## డిజిటల్ గోల్డ్ నియంత్రించబోం.. సెబీ చీఫ్ క్లారిటీ




దిల్లీ: డిజిటల్ గోల్డ్/ ఇగోల్డ్ ఉత్పత్తులను తమ నియంత్రణ పరిధిలోకి తీసుకురాబోమని సెబీ ఛైర్మన్ తుహిన్‌కాంత పాండే తెలిపారు. రీట్స్, ఇన్విట్స్ 2025 కాన్‌క్లేవ్ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మ్యూచువల్ ఫండ్స్ అందించే ఈటీఎఫ్‌లు, గోల్డ్ సెక్యూరిటీల్లో మాత్రమే బంగారానికి సంబంధించిన పెట్టుబడులు పెట్టాలని సూచించారు. ఇతర పెట్టుబడులను తాము నియంత్రించబోమని తెలిపారు. సెబీ తాజా హెచ్చరికల నేపథ్యంలో డిజిటల్ గోల్డ్ పరిశ్రమ వర్గాలు తమను కూడా నియంత్రణ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. దీంతో సెబీ చీఫ్ స్పష్టతనిచ్చారు.

**సెబీ ఏం చెప్పింది?**

బంగారం ధర పరుగులు పెడుతుండడంతో ఇందులో పెట్టుబడి పెట్టాలనుకునే వారు ఇతర మార్గాల కోసం చూస్తున్నారు. ఈ సమయంలోనే చాలామందిని డిజిటల్ గోల్డ్ ఆకర్షిస్తోంది. ఈ క్రమంలోనే వెబ్‌సైట్లు, యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. చెల్లింపుల సేవలను అందిస్తున్న సంస్థలూ వీటిని తీసుకొచ్చాయి. తక్కువ మొత్తంతోనూ బంగారంలో మదుపు చేసేందుకు ఇవి అవకాశం ఇస్తుండటంతో ఎంతోమంది మదుపు చేస్తున్నారు. వెసులుబాటు మాట ఎలా ఉన్నా.. డిజిటల్ గోల్డ్ పథకాలు అత్యంత నష్టభయంతో కూడుకున్నవని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ మదుపరులకు హెచ్చరిక జారీ చేసింది. ఇవేవీ తమ నియంత్రణ పరిధిలోకి రావని, అందువల్ల పెట్టుబడిదారులకు ఎలాంటి రక్షణ ఉండదని స్పష్టం చేసింది. ఒకవేళ ఆ సంస్థ/యాప్‌ను మూసేసినా, దివాలా తీసినా మదుపరుల సొమ్ముకు నష్టం వాటిల్లుతుందని నోటిఫికేషన్ జారీ చేసింది.

## 122 రైల్వేస్టేషన్లలో
# స్విగ్గీ 'ఫుడ్ ఆన్ ట్రైన్' సేవలు




ముంబయి: స్విగ్గీ తన 'ఫుడ్ ఆన్ ట్రైన్' సేవలను విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. దేశవ్యాప్తంగా 122 స్టేషన్లలో ఈ సర్వీస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. ప్రయాణికుల నుంచి మంచి స్పందన రావడంతో ఈ సేవలను మరిన్ని స్టేషన్లకు విస్తరించినట్లు పేర్కొంది. ఇప్పటి వరకు 24 గంటల ముందే ఇచ్చే ప్రీఆర్డర్ సదుపాయాన్ని ఇప్పుడు 96 గంటలకు.. అంటే 4 రోజులకు పెంచింది. దీంతో కస్టమర్లు ప్రయాణానికి ముందే తమకు నచ్చిన ఆహారాన్ని ఆర్డర్ చేసుకోవచ్చని స్విగ్గీ తెలిపింది. కొత్తగా ఆంధ్రప్రదేశ్‌లో అనంతపురం, తమిళనాడులో మధురై, రాజస్థాన్‌లో అల్వార్, కేరళలో కోజికోడ్, ఒడిశాలో ఖుర్దా రోడ్, కర్ణాటకలో యశ్వంత్‌పుర్, ఉత్తర్‌ప్రదేశ్‌లో గోండా తదితర స్టేషన్లను చేర్చారు. ఇటీవల పండగ సీజన్‌లో ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభించిందని కంపెనీ తెలిపింది. '122 స్టేషన్ల వరకు మా నెట్‌వర్క్ పెంచడంతో పాటు ప్రీబుకింగ్ విండోను 4 రోజులకు పెంచాం. దీంతో ప్రయాణికులు ముందుగానే ప్లాన్ చేసుకుని స్థానిక రుచులను ఆనందించే ఆస్కారం ఉంటుంది' అని స్విగ్గీ ఫుడ్ స్ట్రాటజీ, కస్టమర్ ఎక్స్‌పీరియన్స్, కొత్త ఆవిష్కరణల వైస్ ప్రెసిడెంట్ దీపక్ మాలో ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఏడాది దాటితే గ్రాట్యుటీ..
# ఐటీ ఉద్యోగులకు 7వ తేదీలోపే శాలరీ!



ఉద్యోగుల సంక్షేమం, భద్రతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నాలుగు కార్మిక స్మృతులను తీసుకొచ్చింది. పాత 29 చట్టాల స్థానంలో వీటిని రూపొందించింది. వీటిని శుక్రవారం నోటిఫై చేసిన కేంద్రం తక్షణమే అమల్లోకి వస్తున్నట్లు ప్రకటించింది. ఈ సంస్కరణలు ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, సమాన వేతనాలు, మహిళా సాధికారతతో పాటు, అసంఘటిత రంగ కార్మికులకు ముఖ్యంగా గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ కార్మికులకు రక్షణ కల్పించడంలో మైలురాయిగా నిలవనున్నాయి.

* ఉద్యోగులందరికీ నియామక పత్రం తప్పనిసరి. దీంతో ఉద్యోగ భద్రత, పారదర్శకత, స్థిరమైన ఉపాధికి లిఖితపూర్వక హామీ
* గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులు సహా ఉద్యోగులందరికీ సామాజిక భద్రత (PF, ESIC, బీమా మొదలైనవి)
* ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగులకు (FTE) శాశ్వత ఉద్యోగులతో సమానంగా అన్ని ప్రయోజనాలు
* FTEలకు ఐదేళ్లకు బదులుగా కేవలం ఒక సంవత్సరం సర్వీస్ పూర్తయిన తర్వాతే గ్రాట్యుటీకి అర్హత
* అందరి కార్మికులకు కనీస వేతనం చట్టబద్ధమైన హక్కు
* యజమానులు సకాలంలో వేతనాలు చెల్లించడం తప్పనిసరి. ఐటీ ఉద్యోగులకు ఏడో తేదీలోపు చెల్లింపులు
* బీడీ, సిగరెట్లు, మైనింగ్ పరిశ్రమల్లో పనిచేసేవారికి 8 నుంచి 12 గంటల వరకు పనిచేయొచ్చు. వారానికి 48 గంటలు మించొద్దు. 30 రోజుల పని పూర్తి చేసుకుంటే బోనస్‌కు అర్హత
* 40 ఏళ్లు పైబడిన ఉద్యోగులందరికీ యాజమాన్యాలు ఉచిత వార్షిక వైద్య పరీక్షలు అందించడం తప్పనిసరి
* సమాన పనికి సమాన వేతనం తప్పనిసరి. ట్రాన్స్‌జెండర్ సహా లింగ వివక్ష చట్టబద్ధంగా నిషేధం
* సాధారణ పని గంటలు దాటి పనిచేస్తే రెగ్యులర్ వేతనానికి రెట్టింపు చెల్లించాలి.
* రాత్రి షిఫ్టుల్లో, అన్ని రకాల పనుల్లో (అండర్‌గ్రౌండ్ మైనింగ్ సహా) పనిచేయడానికి మహిళలకు అనుమతి. అవసరమైన భద్రతా చర్యలు, వారి సమ్మతి తప్పనిసరి
* మహిళా ఉద్యోగుల కుటుంబంలో అత్తమామలకు చోటు. తద్వారా 'డిపెండెంట్ కవరేజ్' పెరుగుతుంది.
* గిగ్ వర్క్, ప్లాట్‌ఫామ్ వర్క్, అగ్రిగేటర్స్‌కు చట్టంలో మొదటిసారిగా నిర్వచనం
* అగ్రిగేటర్లు (Uber, Swiggy వంటి సంస్థలు) తమ వార్షిక టర్నోవర్‌లో 1-2% (కార్మికులకు చెల్లించే మొత్తంలో 5% వరకు) సామాజిక భద్రత నిధికి కేటాయించడం తప్పనిసరి
* ఆధార్‌లింక్డ్ యూనివర్సల్ అకౌంట్ నంబర్ (UAN) ద్వారా సామాజిక భద్రత ప్రయోజనాలు రాష్ట్రాల మధ్య వలసలతో సంబంధం లేకుండా పూర్తిగా పోర్టబుల్‌గా ఉంటాయి.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Published at D.No. 42-4-61/A2,Bhavani Residency,FFB,2nd Lane , Ramarajuvari veedi, Ramakrishnapuram, Vijayawada - 520011, Andhra Pradesh,Printed at Sri Muktheswara Publications, D.No. 29-23-11, Thadepalli Vari Veedi, Surya Rao Peta, Vijayawada - 520002, Andhra Pradesh. Fax: 040-24054446, Cell:9440265569
Email: bharathasakti@gmail.com, RNI APTEL/2010/36743, Editor: Kesaram Penta Reddy